వీలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611, 7989289492

www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక



హైదరాబాద్ | సంచిక : 1 | సంపుటి : 186 | ఎడిటర్ : తలిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | డిసెంబర్ 2024 | వెల : రూ 10/-

## రైతులతో చర్చలకు సిద్ధమైన కేంద్రం



- జనవరి 3న చర్చలకు సుప్రీం ఆదేశం

**న్యూఢిల్లీ,**

రైతులతో చర్చలు జరిపేందుకు కేంద్రం సిద్ధమైంది. ఎంఎస్‌పిపై మొదటి రౌండ్ చర్చల కోసం జనవరి 3న సుప్రీం కమిటీ సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం)ని ఆహ్వానించింది. రిటైర్డ్ జస్టిస్ నవాబ్ సింగ్ అధ్యక్షతన ఏర్పడిన ఈ సుప్రీంకోర్టు కమిటీ రైతులతో చర్చలు జరపనుంది. ఎస్‌కెఎం ఈ ఆహ్వానాన్ని అంగీకరించిందని ఎస్‌కెఎం జాతీయ సమన్వయ కమిటీ సభ్యులు రమిందర్ సింగ్

-మిగతా 3 లో





## మన్మోహన్ కు శాసన సభ ఘన నివాళి

### భారతరత్న ఇవ్వాలంటూ ప్రత్యేక తీర్మానం

- ఆర్థిక రూపశిల్పి అని కొనియాడిన సీఎం రేవంత్
- మన్మోహన్ దేశ గతిని మార్చిన నేత అని మంత్రుల కితాబు
- ప్రత్యేక సమావేశంలో శ్రద్ధాంజలి ఘటించారు

**హైదరాబాద్,**

దివంగత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు తెలంగాణ అసెంబ్లీ ఘనంగా నివాళి అర్పించింది. ఆయనకు భారతరత్న ఇవ్వాలని ఏకగ్రీవంగా తీర్మానించింది. ఆయన

-మిగతా 3 లో



## రేవంత్ ఎందులో గొప్పో పవన్‌కే తెలియాలి

- పుష్ప-2 కలెక్షన్లలో రేవంత్‌కు 14శాతం వాటా
- కేంద్రమంత్రి బండి సంచలన కామెంట్స్

**కరీంనగర్,**

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ అరెస్ట్‌పై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై పరోక్షంగా కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ హాట్ కామెంట్స్ చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎందుకు గొప్పో పవన్ కల్యాణ్‌కే తెలియాలని అన్నారు. రాష్ట్రంలో ఆరు గ్యారంటీలు అమలు చేసినట్లుగా పవన్ కల్యాణ్ భావిస్తున్నారా అని ప్రశ్నించారు. పుష్ప -2

-మిగతా 3 లో



## 2024 డిసెంబర్ విమానయానాలకు చీకటి నెల

- వివిధ ప్రాంతాల్లో ఏడు ఘోర ప్రమాదాలు
- ఏకంగా 240 మంది దుర్మరణం

**న్యూఢిల్లీ,**

2024 ముగింపునకు చేరింది మరికొన్ని గంటల్లో కొత్త ఏడాదికి స్వాగతం పలికేందుకు ప్రపంచం మొత్తం సిద్ధమవుతోంది. అయితే, ఏడాది చివరి నెల డిసెంబర్ విమానయాన

-మిగతా 3 లో

## న్యూ ఇయర్ వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు



- సైబరాబాద్ పరిధిలో ఫ్లై ఓవర్ల మూసివేత
- డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు యధాతథం
- అర్ధరాత్రి వరకు మెట్రో రైల్ సర్వీసులు

**హైదరాబాద్,**

ఆంగ్ల నూతన సంవత్సరాది మరికొన్ని గంటల్లో రానుంది. ఈ క్రమంలో ప్రపంచమంతా వేడుకలకు సిద్ధం అవుతుంది. న్యూఇయర్ వేడుకల నేపథ్యంలో సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో పోలీసులు ఆంక్షలు విధించారు. డిసెంబరు 31 రాత్రి 10 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు ఐటీ కారిడార్‌లో

-మిగతా 3 లో

## మన్మోహన్ గొప్పతనాన్ని గుర్తించిన పీవీ



- రాజకీయాలకు అతీతంగా ఆర్థిక బాధ్యతలు అప్పగించిన పీవి
- మన్మోహన్‌కు భారతరత్న ఇవ్వాలన్న తీర్మానానికి ఆమోదం
- పీవికి కూడా ఢిల్లీలో గుర్తింపు దక్కాలని కోరిన కేటీఆర్

**హైదరాబాద్,**

మన్మోహన్ సింగ్ గొప్పతనం, సామర్థ్యం, జ్ఞానాన్ని ముందుగా గుర్తించిన వ్యక్తి తెలంగాణ బిడ్డ పీవీ నరసింహారావు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. గొప్ప ఆలోచనకు అరుదైన సందర్భం వచ్చినప్పుడు ప్రపంచంలో ఏ శక్తీ ఆపలేదని చెప్పారు. మన్మోహన్ సింగ్ హాయాంలోనే తెలంగాణ ఏర్పడిందని తెలిపారు.

-మిగతా 3 లో



## మహా కుంభమేళాకు భారీ ఏర్పాట్లు

- 160,000 టెంట్లు, 150,000 టాయిటెట్లు, 1250 కిలోమీటర్ల పైపులైన్

**మహాకుంభ్‌నగర్,**

జనవరి 13వ తేదీ నుంచి ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభ మేళా జరగనున్నది. ఈ నేపథ్యంలో యూపీ ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేసింది. గంగా, యమునా, సరస్వతీ నదీ సంగమ ప్రదేశంలో

-మిగతా 3 లో

## తెలంగాలో పది మంది ఐపీఎస్‌ల బదిలీ

### 2021, 2022 బ్యాచ్‌లకు చెందిన ఐపీఎస్ ఆఫీసర్ల బదిలీ




**హైదరాబాద్,**

తెలంగాణలో 10 మంది ఐపీఎస్ ఆఫీసర్లు బదిలీ అయ్యారు. 2021, 2022 బ్యాచ్‌లకు చెందిన ఐపీఎస్ ఆఫీసర్లను

-మిగతా 3 లో

## లైంగిక దాడి ఘటన నేపథ్యంలో గవర్నర్‌ను కలిసిన నటుడు విజయ్



**చెన్నై,**
అన్నా యూనివర్సిటీలో విద్యార్థినిపై లైంగిక దాడి ఘటన తమిళనాడులో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ ఘటనకు పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. వివిధ పార్టీలు, సంఘాలు అన్నా యూనివర్సిటీ ముందు, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో ఘటనకు వ్యతిరేకంగా ఆందోళనలు నిర్వహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇవాళ తమిళగ వెట్రి కజగమ్ పార్టీ అధ్యక్షుడు, నటుడు విజయ్ తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవిని కలిశారు. రాష్ట్రంలోని పరిస్థితుల నేపథ్యంలో లైంగిక దాడి ఘటనపై మాట్లాడేందుకే విజయ్ గవర్నర్‌ను కలిసినట్లు తెలుస్తోంది. అయితే నటుడు విజయ్ ఈ లైంగిక దాడి ఘటనపై ఇప్పటికే స్పందించారు. అన్నా యూనివర్సిటీ ఘటన తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని, చాలా బాధించిందని నటుడు విజయ్ తన అధికారిక ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు. లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారని, నిందితుడిపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తాను ప్రభుత్వాన్ని కోరానని, ఈ ఘటనలో ఇంకా ఎవరి హస్తమున్నా తగిన శిక్షలు విధించాలని డిమాండ్ చేశానని ఆయన తన పోస్టులో తెలిపారు.

## కుంభమేళాకు ప్రత్యేక రైలు ప్యాకేజీలు



**హైదరాబాద్,**
తెలుగు రాష్ట్రాల నుంచి కుంభమేళాకు వెళ్లాలనుకునే వారకి దక్షిణమధ్యరైల్వే గుడ్ న్యూస్ తెలిపింది. ఇప్పటికే ప్రయాగ్ రాజ్ లో ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయి. గంగా.. యమునా.. సరస్వతి నదులు కలిసే ప్రదేశంలో స్నానం చేస్తే జన్మ .. జన్మల పాపాల నుంచి విముక్తి లభిస్తుందని హిందువులు నమ్ముతుంటారు. తెలుగు రాష్ట్రాల నుంచి కుంభమేళాకు వెళ్లే భక్తులకు ఐఆర్‌టిసి ప్రత్యేక ప్యాకేజీని ప్రవేశపెట్టింది.కుంభమేళా టూర్ ప్యాకేజీలో 8 రోజుల ( 7 రాత్రులు) పర్యటనలో మూడు పుణ్య క్షేత్రాలను సందర్శించుకోవచ్చు. సికింద్రాబాద్ నుంచి బయలు దేరే ఈరైలు తెలుగు రాష్ట్రాల మీదుగా కాశీ.. అయోధ్య.. ప్రయాగ్ రాజ్ వెళ్తుంది. జనవరి 19 తేదీన సికింద్రాబాద్ లో ఈ ట్రైన్ ప్రారంభమవుతుంది. ఈ ట్రైన్ లో మొత్తం 576 సీట్లు ఉండగా వాటిలో స్లీపర్ 320.. థర్డ్ ఏసీ 206.. సెకండ్ ఏసీ 50 ఉన్నాయి. సికింద్రాబాద్, భువనగిరి, జనగాం, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, తుని, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం స్టేషన్లలో బోర్డింగ్.. డీబోర్డింగ్ కు అవకాశం ఉంటుంది.

## ఆన్‌లైన్ బెట్టింగ్ మాయలో పడకండి

**యువతకు ఆర్టీసీ ఎండి సజ్జన్నార్ హెచ్చరిక**



**హైదరాబాద్,**
బెట్టింగ్ యాప్‌లు ఎంతో మంది ప్రాణాలను బలి తీసుకుంటున్నాయని టీజీఆర్టీసీ ఎండీ, ఐపీఎస్ అధికారి వీసీ సజ్జనార్ అన్నారు. కాసులకు కక్కుర్తిపడి వాటికి ప్రచారం చేయొద్దని సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకు ఆయన సూచించారు. ఈమేరకు 'ఎక్స్'లో పోస్టు చేశారు. 'రాత్రికి రాత్రే కోటీశ్వరులు కావొచ్చని.. ఇన్‌ఫ్లుయెన్సర్లు సోషల్ మీడియాలో విడుదల చేసే వీడియోల వల్ల అమాయకులు ఆన్‌లైన్ బెట్టింగ్ మహమ్మారికి బానిసలవుతున్నారు. బంగారు జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. స్వలాభం కోసం ప్రజాశ్రేయస్సును విస్మరించడం ఎంత వరకు సమంజసం? సమాజ క్షేమం పట్టని మీ పెడధోరణులు క్షమించరానివి. కష్టపడకుండానే కాసులు పోగేసుకోవాలన్న ఆలోచన అనర్థమని యువత గుర్తించాలి. స్వార్థ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల మాటలు నమ్మి ఆన్‌లైన్ బెట్టింగ్ మాయలో పడకండి. ఇలాంటి సంఘ విద్రోహ శక్తులకు దూరంగా ఉండండి' అని సజ్జనార్ పేర్కొన్నారు.

# విద్యార్థులపై లాఠీఛార్జి అమానుషం

**-చలికాలంలో జల ఫిరంగులు ప్రయోగిస్తారా**
**-బీహార్ ఘటనపై మండిపడ్డ ప్రియాంక**



**న్యూఢిల్లీ,**
బీహార్‌లో ఆందోళన చేస్తున్న విద్యార్థులపై లాఠీఛార్జి చేయడాన్ని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ తీవ్రంగా ఖండించారు. డబుల్ ఇంజిన్ పాలనలో యువతపై డబుల్ దౌర్జన్యాలు చేస్తున్నారన్నారు. ఈ చలిలో విద్యార్థులపై జలఫిరంగులు ప్రయోగించడం, లాఠీఛార్జి చేయడం అమానుషమని ఆవేదన వ్యక్తంచేశారు. బిహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఇటీవల నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షల్లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ ఆదివారం వేలాదిమంది అభ్యర్థులు పట్నాలోని గాంధీ మైదాన్ వద్ద నిరసనకు దిగిన విషయం తెలిసిందే. వారిని అడ్డుకోవడానికి పోలీసులు జల ఫిరంగులు ప్రయోగించి.. బిహార్‌లో మూడు రోజుల వ్యవధిలో ప్రభుత్వం రెండుసార్లు విద్యార్థులను చిత్రహింసలకు గురిచేసిందని మండిపడ్డారు. పరీక్షల్లో అవినీతి, రిగ్గింగ్‌లు, పేపర్ లీక్‌లను అరికట్టడం తమ బాధ్యత అనే విషయం మరిచిపోయిందన్నారు. తమకు జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా విద్యార్థులు పోరాడుతుంటే సహించలేక వారిని అణచివేయడానికి ప్రయత్నిస్తోందని దుయ్యబట్టారు. బిహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వియాదవ్ మాట్లాడుతూ.. అభ్యర్థులపై పోలీసుల చర్య చాలా బాధాకరమని అన్నారు. 'బీపీఎస్సీ అభ్యర్థులపై పోలీసుల చర్య చాలా దారుణం. చాలామందికి తీవ్ర గాయాలయ్యాయి. బయటకు వచ్చిన వీడియోలను చూస్తుంటే వారెంత బాధను అనుభవించారో అర్థమవుతోంది' అని ఆవేదన వ్యక్తంచేశారు. ఇది నిరంకుశ ప్రభుత్వ నియంతృత్వానికి ఉదాహరణ అన్నారు. ఆప్ రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్ ఈ సంఘటనను నిరంకుశ ప్రభుత్వ నియంతృత్వానికి ఉదాహరణగా అభివర్ణించారు. అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడుతున్న యువతతో పోలీసులు క్రూరంగా ప్రవర్తించడం ప్రభుత్వ నియంతృత్వాన్ని మరోసారి ప్రజలకు తెలియజేసిందని అన్నారు. విద్యార్థిగా ఎన్నో ఉద్యమాలు చేసి.. సీఎం స్థాయికి ఎదిగిన నీతీశ్ కుమార్ ప్రభుత్వం నుంచి ఈ ప్రవర్తనను తానెప్పుడూ ఊహించలేదని అన్నారు. విద్యార్థులతో అధికారులు చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలని కోరారు. బిహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ల్లో అవకతవకల విషయంలో ఆదివారం వేలాదిమంది అభ్యర్థులు పట్నాలోని గాంధీ మైదాన్ వద్ద నిరసనకు దిగారు. జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ విద్యార్థులకు పూర్తి మద్దతును ప్రకటించారు. పరీక్షను రద్దు చేసి.. కొత్తగా మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. అభ్యర్థులను పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. దీంతో కిశోర్‌తోపాటు పలువురు విద్యార్థులపైనా పోలీసులు కేసులు నమోదు చేసి, అదుపులోకి తీసుకున్నారు.

# కాశ్మీర్‌ను కప్పేసిన మంచు దుప్పటి


**-యూనివర్సిటీ పరీక్షలన్నీ వాయిదా**



**శ్రీనగర్,**
కాశ్మీర్‌లో హిమపాతం కారణంగా భారీగా మంచు కురుస్తోంది. దీంతో అక్కడి ప్రభుత్వం పరీక్షలను రద్దు చేసింది. డిసెంబర్ 30న జరగాల్సిన కాశ్మీర్ యూనివర్సిటీ పరీక్షలన్నీ వాయిదా పడ్డాయి. కాశ్మీర్‌లోని చాలా ప్రాంతాల్లో ముఖ్యంగా ఉత్తర, దక్షిణ ప్రాంతాలలో విపరీతమైన మంచు కురుస్తున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ మజిద్ జమాన్ తెలిపారు. పరీక్షలను సకాలంలో నిర్వహిస్తామన్నారు. వాయిదా పడిన పరీక్షలకు కొత్త తేదీలు విడిగా జారీ చేయబడతాయన్నారు. కొత్త సంవత్సరానికి ముందు జమ్మూ కశ్మీర్‌లో మంచు భారీగా కురుస్తోంది. ఈ ప్రభావం జనవరి 1, 2 తేదీల్లో కూడా ఉంటుందని, కొన్ని కొండ ప్రాంతాలు, మైదాన ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశాలు కూడా ఉన్నాయని వెదర్ రిపోర్ట్ అధికారులు ప్రకటించారు. ఆ తర్వాత జనవరి 3, 6 తేదీల మధ్య కశ్మీర్ డివిజన్‌లోని కొన్ని ప్రాంతాలలో భారీ హిమపాతం ఉండవచ్చని వెల్లడించారు. దీంతో జమ్మూ డివిజన్‌లోని అనేక ప్రాంతాలు కూడా ప్రభావితం కానున్నాయి. వాతావరణం అధ్వాన్నంగా ఉన్న నేపథ్యంలో ఆదివారం అనేక ప్రాంతాల్లో పెద్ద ఎత్తున హిమపాతం కురిసింది. ఆ క్రమంలో మంచు తొలగింపు తర్వాత రెండో రోజు జమ్మూ-శ్రీనగర్ జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు పునరుద్ధరించబడ్డాయి. దీంతోపాటు దారిలో నిలిచిన వాహనాలను గమ్యస్థానం వైపు పంపించారు. బనిహాల్, ఖాజిగుండ్ మధ్య రోడ్లు జారడం కారణంగా, డ్రైవర్లు నెమ్మదిగా నడపాలని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఇదే సమయంలో సింథాన్ రోడ్, సోన్‌మార్గ్-కార్గిల్ రోడ్, భదేర్వా-చంబా రోడ్‌తో పాటు జిల్లా రాజోరి, పూంచ్ నుంచి షోపియాన్ (కశ్మీర్) వరకు కలిపే మొఘల్ రోడ్‌లు ఇంకా మంచుతోనే ఉన్నాయి. వీటిని ఇంకా తెరువలేదు. వాతావరణం మెరుగుపడిన తరువాత శ్రీనగర్ అంతర్జాతీయ విమానాశ్రయంలో విమాన కార్యకలాపాలు పునఃప్రారంభించబడ్డాయి. పర్యాటకులు, ప్రయాణికులు ట్రాఫిక్ విభాగం సలహా ప్రకారం ప్రయాణించాలని సూచించారు. అలాగే నేటి నుంచి రైలు సర్వీసులను కూడా పునరుద్ధరించారు. అయితే ఈ రోజు విస్టాడోమ్ సేవలు రద్దు చేయబడ్డాయి. ఈ క్రమంలో లోయలోని చాలా జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రత సాధారణం కంటే 2 నుంచి 6 డిగ్రీలు తక్కువగా ఉంది. ఆదివారం రాజధాని శ్రీనగర్‌లో గరిష్ట ఉష్ణోగ్రత 4.7 డిగ్రీల నుంచి 4.2 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయింది. పహల్గామ్‌లో 5.8 డిగ్రీలు, గుల్‌మార్గ్‌లో 5.3 డిగ్రీల నుంచి మైనస్ 2.0 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయింది. జమ్మూలో గరిష్ట ఉష్ణోగ్రత 20.5 కాగా, కనిష్ట ఉష్ణోగ్రత 6.1 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. బనిహాల్‌లో 6.1 డిగ్రీల సెల్సియస్, బాటోట్‌లో 7.9, కత్రాలో 18.0, భదర్వాలో 10.0 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. లేహ్‌లో గరిష్ట ఉష్ణోగ్రత 0.6 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. గుల్మార్గ్‌లో పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు సున్నా కంటే తక్కువగా ఉండటం విశేషం.

# ఏపీకి మరో రూ.1,82,162 కోట్ల పెట్టుబడులు

**క్లీన్ ఎనర్జీ పాలసీతో ఏపీకి పలు సంస్థలు క్యూ**
**ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి**



**అమరావతి,**
ఏపీ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక ప్రకటన చేశారు. ఏపీలో పలు ప్రాజెక్టులను ఏర్పాటు చేయడానికి సీఎం చంద్రబాబు రూపకల్పన చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఏపీకి మరో రూ.1,82,162 కోట్ల పెట్టుబడులు రానున్నాయి. పెట్టుబడులు ఏపీకి రావడం వల్ల 2,63,411 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దొరకనున్నాయి క్లీన్ ఎనర్జీ పాలసీతో ఏపీకి పలు సంస్థలు క్యూ కడుతన్నాయి. ఎస్ఐపిఎస్ సమావేశంలో పెట్టుబడులకు సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రపంచమంతా ఇప్పుడు గ్రీన్ ఎనర్జీవైపు పయనిస్తుందని తెలిపారు. ఏపీ ఆ దిశగా ఆలోచనలు చేయాల్సి ఉందన్నారు. యూనిట్ విద్యుత్ ధర రూ.5.18 నుంచి రూ.4.80కు తగ్గించడం లక్ష్యమని చెప్పారు. యూనిట్ విద్యుత్ ధర తగ్గించేందుకు వినూత్న యోచనలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వచ్చే ఐదేళ్లలో విద్యుత్ రంగంలో వినూత్న మార్పు చూస్తారని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఏపీలో ప్రజాభిప్రాయానికి తగ్గట్టే పాలన ఉంటుందని తెలిపారు. అధికారులు తమ పనితీరుతో ప్రజలను మెప్పించాలని సీఎం చంద్రబాబు సూచించారు. దీంతో రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు దేశ, విదేశీ కంపెనీలు సైతం క్యూ కట్టాయి. అందులోభాగంగా ఇప్పటికే పలు కంపెనీలు రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు చంద్రబాబు ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకున్నాయి. అలాగే జగన్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం నుంచి లూలు సంస్థ వెళ్లి పోయింది. ఆ సంస్థ సైతం మళ్లీ ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు అంగీకారం తెలిపింది. ఇవేగాకుండా టాటా సంస్థతోపాటు పలు ప్రముఖ ఐటీ కంపెనీలు కూడా ఏపీలో తన సంస్థలను ఏర్పాటు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాయి. అయితే వైసీపీ ప్రభుత్వం హయాంలో ఒక్క పరిశ్రమ కూడా ఏపీకి వచ్చింది లేదు. అలాగే లూలూ సంస్థ కూడా ఏపీ నుంచి పొరుగు రాష్ట్రాలకు వెళ్లిపోయింది. రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు కాకపోవడంతో.. ఉపాధి కోసం యువత దేశంలోని వివిధ రాష్ట్రాలకు తరలి వెళ్లారు. ఈ విషయాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రజలు గ్రహించారు. అందుకే.. ఈ ఏడాది మేలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కూటమికి పట్టం కట్టారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు, పరిశ్రమలు ఏర్పాటుకు దేశవిదేశీ సంస్థలు క్యూ కడుతున్నాయి.

# మన్మోహన్‌కు శాసనభ ఘన నివాళి

(మొదటి తరువాయి)

సేవలను కొనియాడుతూ అసెంబ్లీ ప్రత్యేక సమావేశంలో శ్రద్ధాంజలి ఘటించారు. మన్మోహన్ ఆర్థిక సంస్కరణల రూపశిల్పి అని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారు. మన్మోహన్ మృతి నేపథ్యంలో తెలంగాణశాసనసభ ప్రత్యేక సమావేశంలో ఆయన సంతాప తీర్మానం ప్రవేశపెట్టి మాట్లాడారు. మన్మోహన్ సింగ్ దేశానికి విశిష్ట సేవలు అందించారని రేవంత్ గుర్తుచేశారు. కేంద్ర ఆర్థిక శాఖ సలహాదారుగా, ఆర్బీఐ గవర్నర్‌గా పని చేశారని చెప్పారు. ప్రణాళిక సంఘం డిప్యూటీ ఛైర్మన్‌గా, కేంద్ర ఆర్థిక మంత్రిగా, ప్రధానిగా దేశానికి సేవలందించారని పేర్కొన్నారు. 1991-96 మధ్య దేశ ఆర్థిక వ్యవస్థకు ఆయన ఊపిరిలూదారని సీఎం వివరించారు. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు తెలంగాణ ఏర్పాటుకు మార్గం సుగమం అయింది. 2014లో ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టాన్ని పార్లమెంటు ఆమోదించింది. ఎన్నో ఏళ్ల పోరాట ఫలితంగా తెలంగాణ ఏర్పడింది. మన్మోహన్ సింగ్ ఎల్పీజీ విధానాలతో భారత ఆర్థిక వ్యవస్థను స్థిరంగా నిలిపారు. 2004-14 మధ్య ప్రధానిగా అనేక సామాజిక కార్యక్రమాలు చేపట్టారు. ఉపాధిహామీ, ఆర్టీఐ, ఎన్‌హెచ్‌ఆర్‌ఎంను ప్రారంభించారు. ఆర్థిక స్థితిగతులు మార్చే నిర్మాణాత్మక సంస్కరణలు ప్రవేశపెట్టారని సిఎం అన్నారు. సామాజిక విప్లవ కార్యక్రమమైన ఆధార్‌ను మన్మోహన్ ప్రారంభించారు. సరళీకృత ఆర్థిక విధానాలు తెచ్చి ప్రపంచంతో పోటీపడేలా పునాది వేశారు. ఆయన సేవలు భావితరాలు గుర్తుంచుకోవాలి. ఆయనకు భారతరత్న ఇవ్వాలని ఈ సభ తీర్మానం చేస్తోంది. ప్రపంచం గర్వించదగ్గ ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరని లోటు. ఆయన నీతి, నిజాయతీ, నిబద్ధత కలిగిన నేత. జీవితాన్ని దేశానికి అంకితం చేసిన గొప్ప వ్యక్తి. ప్రధాని సహా అనేక హోదాల్లో ఉన్నా నిరాడంబరంగా జీవించారు. ఉపాధిహామీ పథకాన్ని అనంతపురం, మహబూబ్‌నగర్ నుంచి ప్రారంభించారు. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో మన్మోహన్ సింగ్ విగ్రహం ఏర్పాటు చేస్తాం .2013లో భూసేకరణ చట్టం తెచ్చి నిరుపేదలకు న్యాయం జరిగేలా చేశారు. 2006లో అటవీ హక్కుల చట్టానికి సవరణలు చేసి ఆదివాసీలను ఆదుకున్నారు. ఐటీ రంగంలో శాసించగలుగు తున్నామంటే మన్మోహన్ విధానాలే కారణం. ఆయన తెలంగాణకు ఆత్మబంధువు. 60 ఏళ్ల తెలంగాణ కలను సాకారం చేసిన నాయకుడు. తెలంగాణ బిల్లులను 2 సభల్లో పాస్ చేయించిన సారథి. ‚÷నాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో మన్మోహన్ సింగ్ విగ్రహం ఏర్పాటు చేస్తాం' అని రేవంత్‌రెడ్డి తెలిపారు. మన్మోహన్ సింగ్ సరళీకృత ఆర్థిక విధానాలతో దేశాన్ని బలమైన శక్తిగా నిలిపారని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. అసమానతలు, సామాజిక పరిస్థితి అర్థం చేసుకుని చట్టాల ద్వారా ప్రజల్లో ధైర్యం నింపారన్నారు. మానవతా ప్రమాణాలు నెలకొల్పిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. చేపట్టిన ప్రతి పదవికీ వన్నె తెచ్చారని చెప్పారు. పాలనాపరమైన అంశాలను సామాన్యుడూ తెలుసుకునేలా 2005లో ఆర్టీఐ తెచ్చారని గుర్తుచేశారు. ఆయన తీసుకొచ్చిన ఉపాధి హామీ పథకం దేశ గతినే మార్చేసిందని పేర్కొన్నారు. మానవతా ప్రమాణాలు నెలకొల్పిన గొప్ప వ్యక్తి మన్మోహన్ సింగ్ అని భట్టి విక్రమార్క చెప్పారు. మన్మోహన్ సింగ్ హయాంలోనే విప్లవాత్మక భూసేకరణ చట్టం వచ్చిందని తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. దేశ క్షేమం దృష్ట్యా మన్మోహన్ సింగ్ న్యూక్లియర్ ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆయన మృతి దేశానికి తీరని లోటు. రైతులకు రుణమాఫీ చేసిన తొలి ప్రధాని మన్మోహన్ సింగ్. సోనియా గాంధీ సూచనల మేరకు ఆయన గొప్ప చట్టాలు తెచ్చారు. ఆయన ప్రధానిగా ఉన్నప్పుడే గ్రామీణ ఉపాధి హామీ చట్టం వచ్చింది. ప్రభుత్వంలో ఉన్నవారు జవాబుదారీగా ఉండాలని సమాచార హక్కు చట్టం తీసుకొచ్చారు. ప్రజల సొమ్ముతో చేసిన పనుల వివరాలు తెలుసుకొనే హక్కు దీని ద్వారా లభించింది. ఆకలి చావులు ఉండకూడదని ఆహార భద్రత చట్టం తెచ్చారు' అని ఉత్తమ్‌కుమార్ రెడ్డి చెప్పారు.

దేశాభివృద్ధికి మన్మోహన్ సింగ్ అనేక గొప్ప విధానాలు తీసుకొచ్చారని మంత్రి శ్రీధర్‌బాబు గుర్తు చేసుకున్నారు. ఆయన సాధారణ స్థాయి నుంచి ఉన్నతస్థాయికి ఎదిగారని కొనియాడారు. మన్మోహన్‌ను ఆర్థికమంత్రిగా అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు ఎంపిక చేశారని గుర్తు చేశారు. గ్రామీణ పేదలకు పని కల్పించే ఉపాధి హామీ పథకాన్ని మన్మోహన్ తెచ్చారని పేర్కొన్నారు. స్టాక్ మార్కెట్ పటిష్ఠంగా ఉండేలా చర్యలు తీసుకున్నారన్నారు. సామాన్య ప్రజలకు ఆయుధమైన 'ఆర్టీఐ', ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉండాలనే ఉద్దేశంతో 'ఆధార్' తెచ్చారన్నారు. మన్మోహన్ సింగ్ హయాంలో రాష్ట్రాల్లో ట్రిపుల్ ఐటీలు ఏర్పాటు చేశారని వివరించారు. తెలంగాణ ఏర్పాటులో ఆయన క్రియాశీల పాత్ర పోషించారని శ్రీధర్‌బాబు చెప్పారు.

# మన్మోహన్ గొప్పతనాన్ని గుర్తించిన పీవీ

(మొదటి తరువాయి)

కేంద్రంలో ఓబీసీ శాఖను ఏర్పాటు చేయాలని మన్మోహన్ సింగ్‌ను కేసీఆర్ కోరారని గుర్తుచేశారు. మన్మోహన్‌కు నివాళి కోసం అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశం అయింది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు సభ సంతాపం తెలిపింది. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. 'దివంగత మాజీ ప్రధాని మాన్మోహన్ సింగ్‌కు నివాళులర్పించే సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన సంతాప తీర్మానానికి బీఆర్ఎస్ తరఫున పూర్తిగా మద్దతిస్తున్నట్లు ప్రకటించారు. మన్మోహన్ సింగ్‌కు భారత రత్న ఇవ్వాలనే ప్రతిపాదనతో సంపూర్ణంగా ఏకీభవిస్తున్నామని అన్నారు. మన్మోహన్ సింగ్ గొప్పదనాన్ని, సామర్థ్యాన్ని మొదటిసారిగా గుర్తించింది మన తెలంగాణ బిడ్డ పీవీ నరసింహా రావు అనేది నిర్వివాదాంశం. పీవీ నరసింహా రావు దేశ ప్రధానిగా ఎన్నికైన తర్వాత రాజకీయాలతో సంబంధ లేని ఒక ఆర్థిక వేత్తను ఫైనాన్స్ మినిస్టర్‌గా నియమించారు. 1991లో బడ్జెట్ ప్రవేశపెడుతూ 'ప్రపంచం మొత్తం వినాల్సిన సమయం వచ్చింది. నా దేశం మేల్కొని ఉంది..' అంటూ ఆర్థిక వేత్తగా సంస్కరణలను ప్రవేశపెట్టే సందర్భంగా మాట్లాడారు. ఆ మాటలు.. ఆయన సిద్ధాంతం, పీవీ నరసింహారావు నాయకత్వం నేడు దేశంలో సమూల మార్పులు తీసుకొచ్చింది. కేవలం 15 రోజులు ఫారెక్స్ నిల్వలు ఉన్న నాటి రోజు నుంచి ప్రపంచమంతా ఆశ్యపడే స్థాయికి దేశాన్ని పరుగెత్తించిన ఆర్థిక సంస్కరణల శీలి డాక్టర్ మన్మోహన్ సింగ్. అనవసరపు డాంభికాలు, ఆర్భాటాలు, హడావుడి లేకుండా సింపుల్ లివింగ్.. హై థింకింగ్ అనే మాటకు పర్యాయపదంగా మన్మోహన్ సింగ్‌ను మనం చెప్పుకోవచ్చు. విశ్వాసం అనే నేటి రాజకీయాల్లో అరుదైన పదం. తనకు అండగా నిలబడిన కాంగ్రెస్ పార్టీకి జీవితాంతం సేవలందించిన మహానుభావుడు. ఆర్థికమంత్రిగా, తర్వాత ప్రధానిగా పనిచేసి, ఆ పార్టీ అధికారం కోల్పోయిన తర్వాత కూడా పూర్తి స్థాయిలో పార్టీ కోసం పనిచేసిన అభ్యుదయ వాది, నిరాడంబర మనిషి మన్మోహన్ సింగ్ అని అన్నారు. ఆయన ప్రధానిగా ఉన్న కాలంలోనే తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్.. ఏడాదిన్నరపాటు కేంద్ర మంత్రిగా పనిచేశారు. నాటి కాంగ్రెస్ పార్టీతో పొత్తుపెట్టుకుని గెలుపొందిన తర్వాత భాగస్వామ్య పక్షాలను మంత్రివర్గంలోకి తీసుకున్నారు. కేసీఆర్‌కు షిప్పింగ్ మంత్రి పదవి ఇస్తే.. డీఎంకేతో చిక్కుముడి ఏర్పడింది. దీంతో మన్మోహన్ సింగ్ వద్దకు వెళ్లి తాను వచ్చింది పదవుల కోసమో, పోర్టుఫోలియోల కోసమో కాదు.. తెలంగాణ కోసమని చెప్పిన కేసీఆర్.. ఆ మంత్రిత్వ శాఖను డీఎంకేకి ఇచ్చారు. ఈ సందర్భంగా ఏ నిబద్ధతతో వచ్చారో అది ఫలించాలని కోరుకుంటున్నానని కేసీఆర్‌తో మన్మోహన్ అన్నారు. మీరు తీసుకున్న నిర్ణయంతో గుర్తింపు వస్తుందని, కర్మయోగిగా గుర్తించబడతారని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి తర్వాత.. ఒక గొప్ప ఆలోచనకు అరుదైన సందర్భం వచ్చినప్పుడు ప్రపంచంలో ఏ శక్తీ ఆపలేదు. అలాగే మన్మోహన్ సింగ్ నమ్మారు కాబట్టే.. తెలంగాణ ఉద్యమంలో ఉన్న నిబద్ధత, ఉద్యమానికి ఉన్న బలం, తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తి.. అన్నీ ఆయనకు అర్థమయ్యాయి కాబట్టే అనివార్య పరిస్థితుల్లో మన్మోహన్ సింగ్ నాయకత్వంలో తెలంగాణ ఏర్పడింది. దానిని తాము మర్చిపోం అని అన్నారు. మన్మోహన్ సింగ్ నిబద్ధతను గుర్తుచేసే సందర్భంలో సరిగ్గా ప్రధానిగా వారు ఎన్నికైన తర్వాత ఆరు నెలలకు కేసీఆర్.. క్యాబినెట్ సహచరుడిగా డిసెంబర్ ముఖ్యమైన డెలిగేషన్ తీసుకొస్తున్నానని, తమకు సమయం ఇవ్వాలని కోరారు. బలహీన వర్గాలకు చెందిన నాయకులను తీసుకొస్తున్నానని, తమకు ఐదు నిమిషాలు సరిపోదని 30 నిమిషాలకు కావాలని కోరారు. సమస్య తీవ్రతను అర్థం చేసుకున్న నాటి ప్రధాని 45 నిమిషాలు సమయమిచ్చారు. ఆయన గొప్పతనమేంటంటే.. కేంద్రంలో ఓబీసీలకు ఒక మంత్రిత్వ శాఖ ఉండాలని ప్రధాని వద్దకు 2004, డిసెంబర్ 18న ఒక బృందాన్ని తీసుకెళ్తే, 45 నిమిషాలు సమయమిచ్చిన మన్మోహన్ సింగ్ గంటన్నరపాటు వారితో గడిపారు. ఎన్నో అడ్డంకులు, ఎన్నో అభ్యంతరాలున్నా మన్మోహన్ సింగ్ ప్రజా ఉద్యమాలకు అండగా నిలబడ్డారు. ఎన్నడూ కూడా, ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా సంస్కరణల బాట నుంచి వెనక్కి తగ్గలేదు. ఆయన్ని మనం సైలెంట్ ఆర్కిటెక్ట్ ఆఫ్ మోడ్రన్ ఇండియా అని పిలువవచ్చు. మన్మోహన్ కాదు ఈయన మౌన మోహన్ సింగ్ అని, మౌన ముని అని పేర్లు పెట్టారు.

## 2024 డిసెంబర్ విమానయానాలకు చీకటి నెల

(మొదటి తరువాయి)

చరిత్రలో 'చీకటి నెల'గా నిలిచింది. ఎందుకంటే డిసెంబర్ నెలలో ఏకంగా ఏడు ఘోరమైన విమాన ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. మొత్తం ఏడు ప్రధాన ఘటనల్లో ఏకంగా 240 మంది మరణించడం కలచివేస్తోంది. ఈ ఒక్క నెలలో జరిగిన విమాన ప్రమాదాలు విమానయాన భద్రతపై పలు ప్రశ్నల్ని లేవనెతుతున్నాయి. దక్షిణ కొరియాలో ఆదివారం ఘోర విమాన ప్రమాదం సంభవించిన విషయం తెలిసిందే. దాదాపు 179 మంది ప్రయాణికులు సజీవంగా దహనమయ్యారు. ల్యాండింగ్ అవుతున్న సమయంలో గేర్ పనిచేయకపోవడంతో విమానం వేగంగా రన్‌వేపై దూసుకువెళ్లి ఫెన్సింగ్ గోడను ఢీకొంది. వెంటనే విమానంలో మంటలు చెలరేగి అందులోని ఇద్దరు సిబ్బంది మినహా మొత్తం 179 మంది సజీవదహనం చెందారు. దక్షిణ కొరియా విమానయాన చరిత్రలోనే ఇది అత్యంత ఘోర ప్రమాదంగా భావిస్తున్నారు. డిసెంబర్ 25న అజర్‌బైజాన్ విమానం కూలిన ప్రమాదంలో 38 మంది ప్రాణాలు కోల్పోయారు. అజర్‌బైజాన్ రాజధాని బాకు నుంచి రష్యాలోని గ్రోజ్నీకి బయల్దేరిన విమానాన్ని పొగమంచు కారణంగా కజకిస్థాన్‌లోని అక్టౌ విమానాశ్రయానికి మరలించారు. విమానం దానికి దగ్గర్లో ల్యాండ్ అవుతున్నప్పుడు పక్షి ఢీకొనడంతో కుప్ప కూలి మంటలు చెలరేగాయి. ఆ సమయంలో విమానంలో 37 మంది అజర్‌బైజాన్ వాసులు, 16 మంది రష్యన్లు, ఆరుగురు కజకిస్థానీలు, ముగ్గురు కిర్‌గిస్థానీ పౌరులు ఉన్నారు. ఈ ఘటనలో 38 మంది దుర్మరణం పాలయ్యారు. 27 మంది గాయపడ్డారు. డిసెంబర్ 22న మూడు ప్రమాదాలు.. 19 మంది మృతి డిసెంబర్ 22న బ్రెజిల్‌లో సంభవించిన విమాన ప్రమాదంలో పది మంది ప్రాణాలు కోల్పోయారు. విదేశీ ప్రయాణికులతో వెళుతున్న ఓ బుల్లి విమానం ఆదివారం దక్షిణ బ్రెజిల్ టూరిస్ట్ సిటీ గ్రామాడోలోని దుకాణాల్లోకి దూసుకెళ్లింది. ప్రమాద సమయంలో విమానంలో పది మంది ఉండగా.. వారంతా ప్రాణాలు కోల్పోయారు. క్రిస్మస్ పండుగకు కొద్ది రోజుల ముందు ఈ ఘటన జరిగింది. అందరూ పండుగ కోసం ముస్తాబవుతున్న నేపథ్యంలో ఈ ఘటన జరగడం స్థానికుల్లో విషాదాన్ని నింపింది.

## మహాకుంభమేళాకు భారీ ఏర్పాట్లు

(మొదటి తరువాయి)

జరిగే మహాకుంభ్‌కు లక్షల సంఖ్యలో జనం హాజరుకానున్నారు. పుణ్య స్నానాల కోసం వచ్చే భక్తులకు భారీ ఏర్పాట్లు చేశారు. రోడ్లు వెడల్పు చేసి, ఘాట్లను సమం చేసి, నది వద్ద టెంట్లు ఏర్పాటు చేసే అంశంలో కార్మికులు ఓ సైన్యంలా పనిచేస్తున్నారు. ప్రధాని మోదీ మన్‌కీ బాత్ ప్రోగ్రామ్‌లో దీనిపై మాట్లాడారు. ఐకమత్యానికి మహాకుంభ్ అని మోదీ ఆ ఈవెంట్‌ను వర్ణించారు. మహాకుంభ్ నుంచి తిరిగి వెళ్తూ.. ద్వేష, విభజన భావాన్ని వీడాలని సందేశం ఇచ్చారు. మహాకుంభ్ కా సందేశ్.. ఏక్ హో పూరా దేశ్ అని మోదీ అన్నారు. 12 ఏళ్లకు ఒకసారి వచ్చే మహాకుంభ్.. వచ్చే ఏడాది జనవరి 13వ తేదీన పౌశ పున్నమి రోజున ప్రారంభంకానున్నది. ఫిబ్రవరి 26వ తేదీన మహాశివరాత్రితో మహాకుంభ్ ముగుస్తుంది. ఆ పవిత్ర సమయంలో నదీ స్నానం చేసేందుకు దేశం నలుమూలల నుంచి లక్షల సంఖ్యలో భక్తులు ప్రయాగ సంగమం వద్దకు చేరుకుంటారు. ఈ ఏడాది మహాకుంభ్ సమయంలో సుమారు 40 కోట్ల మంది పుణ్యస్నానాలు ఆచరిస్తారని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. కోట్లాది మందికి తగిన రీతిలో ఏర్పాటు చేస్తున్నారు. సుమారు లక్షా 60 వేల టెంట్లను ఏర్పాటు చేశారు. సుమారు లక్షా 50 వేల టెయిలెట్లను నిర్మించారు. దాదాపు 15వేల మంది శానిటేసన్ వర్కర్లు పనిచేయనున్నారు. 1250 కిలోమీటర్ల దూరం పైప్‌లైన్ వేశారు. 67 వేల ఎల్‌ఈడీ లైట్లు, రెండు వేల సోలార్ లైట్లు, మూడు లక్షల వృక్షాలను ఏర్పాటు చేశారు. సులభ స్నానాల కోసం తొమ్మిది పేవ్మెంట్ ఘాట్లు, ఏడు రివర్‌ఫ్రంట్ రోడ్డు, 12 కిలోమీటర్ల తాత్కాలిక ఘాట్లను నిర్మిస్తున్నారు. ఏడు బస్టాండ్లను నిర్మిస్తున్నారు. ఆ ప్రాంతాన్ని సర్వాంగసుందరంగా తీర్చేందుకు స్ట్రీట్ పెయింటింగ్స్ చేస్తున్నారు. గత కొన్నేళ్ల నుంచి ప్రయాగ్‌రాజ్‌లో నదీ పరివాహక ప్రాంతం తగ్గిపోయింది.

# రైతులతో చర్చలకు సిద్ధమైన కేంద్రం

(మొదటి తరువాయి)

పాటియాలా తెలిపారు. పంటలకు ఎంఎస్‌పి (కనీస మద్దతు ధర)కి కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధ హామీ కల్పించాలంటూ పంజాబ్, హర్యానా ప్రభుత్వాలు గత కొన్ని రోజులుగా ఆందోళన చేపడుతున్న సంగతి తెలిసిందే. మరోవైపు సంయుక్త కిసాన్ మోర్చా (రాజకీయేతర విభాగం), కిసాన్ మజ్దూర్ మోర్చాలు డిసెంబర్ 30 బంద్‌కు పిలుపునిచ్చాయి. సోమవారం ఉదయం 7.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు బంద్ కొనసాగనుంది. బంద్‌తో వందేభారత్ సహా 150 రైళ్లు రద్దయ్యాయి. 200కి పైగా ప్రదేశాలలో చక్కాజామ్‌ల కారణంగా బస్సులు నిలిచిపోయాయి. విద్యా సంస్థలు, వాణిజ్య సముదాయాలు మూతపడ్డాయి. ఎంఎస్‌పి సహా రుణమాఫీ, విద్యుత్ చార్జీలు, రైతులకు, రైతు కూలీలకు పింఛన్ల వంటి 13 డిమాండ్లను పరిష్కరించాలంటూ రైతు నేత దల్లేవాలే గత 35 రోజులుగా నిరాహార దీక్ష చేపడుతున్నారు.

# రేవంత్ ఎందులో గొప్పో పవన్‌కే తెలియాలి

(మొదటి తరువాయి)

మూవీ కలెక్షన్లలో రేవంత్‌కు 14 శాతం వాటా ముట్టిందేమోననే అనుమానం తనకు ఉందని సంచలన ఆరోపణలు చేశారు. సోమవారం కరీంనగర్‌లో బండి సంజయ్ పర్యటించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ... తెలంగాణ అసెంబ్లీ ఎందుకు పెట్టారంటే.. అల్లు అర్జున్ కోసం అన్నట్లుగా ఉందని విమర్శించారు. అల్లు అర్జున్‌కు రేవంత్‌కు ఎక్కడో చేడిందని ఆరోపించారు. ఒక వ్యక్తి గురించి ఇంతగా అసెంబ్లీలో మాట్లాడాల్సిన అవసరం ఏంటని బండి సంజయ్ నిలదీశారు. కాంగ్రెస్‌లో అంత్యర్యుద్ధం జరుగుతోందని బండి సంజయ్ విమర్శించారు. మీషన్ల విషయంలో మంత్రుల మధ్య సఖ్యత లేదని అన్నారు. కాంగ్రెస్‌లో ఏమైనా జరగొచ్చు.. వాళ్లలో వాళ్లు ఏమైనా చేసుకోవచ్చని షాకింగ్ కామెంట్స్ చేశారు. 14 శాతం కమిషన్ మీదే ప్రభుత్వం బతుకుతోందని సంచలన ఆరోపణలు చేశారు. ప్రభుత్వంలో కీలకంగా ఉన్న ముగ్గురు మంత్రుల బండారం బయట పెడతానని హెచ్చరించారు. బ్రోకర్లను పెట్టుకుని బిల్లులు మంజూరు చేస్తున్నారని ఆరోపణలు చేశారు. మంత్రులందరికీ సీఎం కావాలని ఉందని అన్నారు. ఢిల్లీకి డబ్బులు పంపడం వల్లే.. సీఎం పదవి నిలబడుతోందని ఆరోపించారు. డబ్బులు ఇవ్వకుంటే మంత్రుల కుర్చీలు కూడా ఉండవని బండి సంజయ్ తీవ్ర విమర్శలు గుప్పించారు.

# న్యూ ఇయర్ వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు

(మొదటి తరువాయి)

ఫ్లై వర్లను మూసివేయనున్నట్లు పోలీసులు తెలిపారు. ఓఆర్‌ఆర్‌పై భారీ వాహనాలు, ఎయిర్‌పోర్టుకు వెళ్లే వాహనాలను మాత్రమే అనుమతిస్తామన్నారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో స్పెషల్ కెమెరాలను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. సిగ్నల్ జంపింగ్, ర్యాష్ డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపడతారని చెప్పారు. మద్యం సేవించిన వారికి పబ్‌లు, బార్ల యాజమానులు ప్రైవేటు వాహనాలు, డ్రైవర్లను అందుబాటులో ఉంచాలని పోలీసులు సూచించారు. న్యూఇయర్ వేడుకల దృష్ట్యా డిసెంబరు 31న రాత్రి ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించ నున్నట్లు తెలంగాణ ఫోర్ వీలర్స్ సంఘం ప్రకటించింది. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఉచిత రవాణా సౌకర్యాన్ని కల్పించనున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు. 500 కార్లు, 250 క్యాబ్‌లు అందుబాటులో ఉంటాయని అసోసియేషన్ తెలిపింది. ప్రజలు మద్యం మత్తులో వాహనాలు నడపొద్దని, రోడ్డు ప్రమాదాలు జరగకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. నూతన సంవత్సర వేడుకలను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్ మెట్రో రైళ్లు అర్ధరాత్రి వరకు సేవలందించనున్నాయి. డిసెంబర్ 31 సెలబ్రేషన్స్ సందర్భంగా రాత్రి 12.30 వరకు నడవనున్నాయి. ప్రయాణికుల సౌకర్యార్థం అర్ధరాత్రి 12.30కి చివరి రైలు స్టేషన్ నుండి బయలుదేరి 1.15 వరకు డెస్టినేషన్ స్టేషన్లో చేరుకోనున్నట్టు మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ప్రకటించారు. న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ సందర్భంగా అర్ధరాత్రి వేడుకలు ఉండటంతో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు విస్తృతంగా జరిగే అవకాశం ఉండటంతో సేఫ్ గా ఇంటికి చేరుకునేందుకు మెట్రో ఎంతగానో ఉపయోగపడనుంది. ఈ క్రమంలో.. ప్రయాణికులు మెట్రో రైల్‌లో సేవ్ జర్నీ చేయాలని మెట్రో ఎండీ సూచించారు. మెట్రో రైల్ సేవలను ప్రత్యేక అకేషన్ పండుగలు టైంలో అర్ధరాత్రి వరకు మెట్రో సేవలను పొడిగిస్తున్నట్టు తెలిపారు. మద్యం తాగి మెట్రోలో తోటి ప్రయాణికులను ఇబ్బంది పెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రయాణికులంతా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మెట్రో ఎండీ సూచించారు.

# తెలంగాలో పది మంది ఐపీఎస్‌ల బదిలీ

(మొదటి తరువాయి)




ప్రభుత్వం బదిలీ చేసింది. ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్ ఏఎస్పీగా కాజల్, రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలోని భువనగిరి ఏఎస్పీగా కంకణాల రాహుల్ రెడ్డి, ఆసిఫాబాద్ ఏఎస్పీగా చిత్తరంజన్, కామారెడ్డి ఏఎస్పీగా బొక్కా చైతన్య, జనగామ ఏఎస్పీగా పందిరే చైతన్య రెడ్డి, భద్రాచలం ఏఎస్పీగా విక్రాంత్ కుమార్ సింగ్, కరీంనగర్ రూరల్ ఏఎస్పీగా నగ్రాలే శుభం ప్రకాశ్, నిర్మల్ ఏఎస్పీగా రాజేశ్ మీనా, దేవరకొండ ఏఎస్పీగా పీ మౌనిక బదిలీ అయ్యారు.

## సంపాదకీయం

# సంస్కర్త' హృదయంలో సామాన్యుడు

ఆర్బీఐ (భారతీయ రిజర్వ్ బ్యాంక్) గవర్నర్‌గా సెప్టెంబర్ 2008లో నియమించారు. ఈ నియామకం సమయంలో నేను న్యూఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా ఉన్నాను. ముంబైకు వెళ్లే ముందు, నా మీద నిండు నమ్మకంతో ఈ బృహత్తర బాధ్యత అప్పగించినందుకు ధన్యవాదాలు తెలిపేందుకై ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ వద్దకు వెళ్లాను. ఆయనతో నా సమావేశం క్లుప్తంగా - కేవలం 15 నిమిషాల పాటే జరిగింది. దేశ ఆర్థిక వ్యవస్థ స్థితిగతులు, ప్రభుత్వ ద్రవ్య విధానానికి సంబంధించిన సవాళ్లు, ఇంకా ద్రవ్యోల్బణానికి వ్యతిరేకంగా రూపాయి విలువను కాపాడడంలో ఆర్బీఐకి ఎదురయ్యే సమస్య గురించి మేము మాట్లాడుకున్నాం. డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎదుటి వ్యక్తి చెప్పేది శ్రద్ధగా వినే వ్యక్తి. ఈ గుణ విశేషం తక్కువ మందిలో ఉంటుంది, నాయకులలో కొద్దిమందిలో మాత్రమే ఉంటుంది. ఆయనకు అప్పటికే తెలిసిన విషయాన్ని చెప్పినా చాలా ఓర్పుగా వింటారు. తెలిసిన విషయమైనా మీ వివరణలో ఏమైనా సున్నిత సూక్ష్మాలూ, కొత్త దృక్కోణాలు ఉన్నాయేమోనని ఆయన శ్రద్ధ చూపుతారు. ఆయనలో నేను అభిమానించే విషయాలలో ఇది ఒకటి. పది నిమిషాల పాటు మాటా మంతీ అయినాక నేను ఇలా అన్నాను: 'సర్, మీరూ ఆర్బీఐ గవర్నర్‌గా పని చేశారు. నాకు ఏమైనా సలహా ఇవ్వగలరా?' ఆయన స్వాభావికంగా ఒక అస్ఫుటమైన చిరునవ్వు (ఈ మందహాసాన్ని మీరు మన్మోహన్ పెదవులపై కంటే ఆయన కళ్లలోనే ఎక్కువగా చూడగలరు)తో విముఖత తెలిపారు. 'సుబ్బారావు, మీకు నేను ఏమి సలహా ఇవ్వగలను? మీరు ఐఏఎస్‌లో ఉన్నారు. మీకు దేశం తెలుసు, ప్రభుత్వం తెలుసు. ఆర్బీఐ వ్యవహారాలు మీకు సుపరిచితమే. ఆర్థిక వ్యవస్థ పెరుగుదలకు, పురోగతికి ఏది అత్యుత్తమమని మీరు భావిస్తారో అదే చేయండి. మీరు మన ఆర్థిక వ్యవస్థకు తప్పక మేలు చేస్తారనడంలో నాకు సందేహం లేదు' అని మన్మోహన్ అన్నారు. రెండు నిమిషాల అనంతరం ప్రధానమంత్రితో నా సంభాషణని ముగించాను. వెళ్ళేందుకు లేచి నిలబడగా ఆయన తన కుర్చీ నుంచి లేచి వచ్చి నాకు వీడ్కోలు చెప్పేందుకు ద్వారం దాకా వచ్చారు. ద్వారం వద్ద నా భుజం చుట్టూ తన చెయ్యి వేసి ఇలా అన్నారు: 'సుబ్బారావు, ఇంతకు ముందు మీరు నా సలహా కోసం అడిగారు. మీకు ఒక సలహా ఇవ్వదలుచుకున్నాను. మీరు ఐఏఎస్ నుంచి ఆర్బీఐకి వెడుతున్నారు. అదొక పెద్ద మార్పు. ఐఏఎస్‌లో వలే కాకుండా ఆర్బీఐలో మీరు ద్రవ్యోల్బణం, వడ్డీ రేటు, ద్రవ్య సరఫరా, ఋణ పెరుగుదల అంకెల అరణ్యంలో చిక్కుకుపోయే ప్రమాదం ఉన్నది. ఆర్బీఐ తీసుకునే నిర్ణయాలు, చేపట్టే చర్యలు ప్రజలకు, వారి జీవనాధారాలకు ఎంత ముఖ్యమో మీరు మరచిపోవచ్చు. ఈ వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకుని మీ నిర్ణయాలు, చర్యల ఫలితంగా నెలకొనే పరిస్థితులను తెలుసుకునేందుకు సదా జాగరూకతతో ఉండండి'. ముంబైకు వెళ్లే ముందు ఢిల్లీలో ముగించవలసిన అనేక పనుల విషయం నా మనస్సునిండా ఉండడంతో ఆ సలహా, నేను ప్రధానమంత్రి కార్యాలయం నుంచి బయటకు వచ్చిన నిమిషంలోగానే నా మనసు నుంచి అదృశ్యమయింది. ఆ తరువాత కొద్ది నెలల్లో ఆర్బీఐ గవర్నర్‌గా నా బాధ్యతల నిర్వహణలో నేను తలమునకలుగా ఉండగా మన్మోహన్ సలహాలో ఇమిడి ఉన్న భావం, దాని ప్రాముఖ్యత నాకు తెలిసివచ్చాయి. ఈ విషయాన్ని చూడండి. ప్రతి త్రైమాసికంలోను ద్రవ్య విధాన సమీక్ష జరుగుతుంది. ఇందుకు సన్నద్ధంగా సంబంధిత వ్యక్తులు, సంస్థలు%-% ఆర్థికవేత్తలు, బ్యాంకులు, బ్యాంకేతర ఫైనాన్స్ కంపెనీలు, మార్కెట్ల ప్రతినిధులు అందరితో సంప్రదింపులు జరుగుతాయి. ఏ ఆర్బీఐ గవర్నర్ కూడా ఎప్పుడూ ఇలా చెప్పలేదు : 'ఓకె, ఇప్పుడు వీధుల్లో ఉన్న 25 మంది సామాన్య పౌరులను తీసుకురండి. ద్రవ్యోల్బణం, ఉద్యోగాలు తదితర ప్రధానమైన ఇతర అంశాల గురించి వారిని నేను సంప్రదించదలుచుకున్నాను'. చెప్పవచ్చిన దేమిటంటే ఆర్బీఐ తీసుకున్న నిర్ణయాలు, చేపట్టే చర్యలు ప్రజల దైనందిన జీవితాలను ప్రభావితం చేస్తాయి. ద్రవ్యోల్బణమనేది ఒక తిరోగామి పన్ను. అది సంపన్నుల కంటే పేదవారిని ఎక్కువగా నష్టపరుస్తుంది. కనుక పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకోవాలన్నదే మన్మోహన్ న్యూఢిల్లీలో నాకు వీడ్కోలు చెప్తూ ఇచ్చిన సలహా. ఆర్బీఐ పట్ల మన్మోహన్ సింగ్‌కు గొప్ప గౌరవం ఉన్నది. దాని స్వతంత్ర ప్రతిపత్తిని కాపాడవలసిన అవసరాన్ని ఆయన బాగా అర్థం చేసుకున్నారు. ఆర్బీఐ స్వతంత్రంగా, స్వేచ్ఛగా వ్యవహరించగలిగేందుకు ఆయన చేయగలిగినదంతా చేశారు. గతంలో ఆర్బీఐ గవర్నర్‌గా పనిచేసిన మన్మోహన్ అది తన విశ్వసనీయతను కొనసాగించుకోవాలని సదా ఆకాంక్షించేవారు. ఆర్థిక మంత్రిగా ద్రవ్య విధానం విషయంలో ఆయన ఎటువంటి జోక్యం చేసుకోలేదు. విధాన నిర్దేశాలు, లక్ష్యాల విషయంలో ప్రభుత్వం, ఆర్బీఐ మధ్య విభేదాలు ఏ ఒక్క ప్రభుత్వానికి గానీ లేదా ఏ ఒక్క ఆర్బీఐ గవర్నర్‌కు గానీ పరిమితమైనవీ కావు, ప్రత్యేకమైనవీ కావు. ఒక విధంగా అవి వ్యవస్థలోనే ఉన్నాయి. యూపీఏ ప్రభుత్వ హయాంలోనూ ఆ అభిప్రాయ బేధాలు వ్యక్తమయ్యాయి. అలాగే ఇప్పుడు ఎన్‌డీఏ ప్రభుత్వ హయాంలోను ఆ భిన్నాభిప్రాయాలు బాగానే ఉన్నాయి. ఇది సహజం మీరు వాటిని ఆమోదించకపోయినా ఆ విభేదాలు తలెత్తుతూనే ఉంటాయి. ఆర్థిక వ్యవస్థ పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పుడు ఈ విభేదాలు మరింత తీవ్రంగా ఉండడం కద్దు. యూపీఏ రెండో ప్రభుత్వ హయాం (2009%-%14)లో ఇదే జరిగింది ప్రభుత్వంలోనే అంతర్గతంగా విధాన వైకల్యం ఏర్పడిందని ఆనాడు అందరూ భావించారు. అంతే కాకుండా శ్టాగ్‌ఫ్లేషన్ (స్తబ్ధతా ద్రవ్యోల్బణం%-% గిరాకీలో గానీ, ఉద్యోగితలో గానీ పెరుగుదల లేకుండా ద్రవ్యోల్బణం ఏర్పడిన స్థితి) గురించి భయాలు కూడా ముమ్మరంగా నెలకొన్న రోజులవి. విధాన నిర్దేశాలు, లక్ష్యాల విషయమై నాటి ఆర్థిక మంత్రులు %-%ప్రణబ్ ముఖర్జీ, పి.చిదంబరం%-%తో నాకు విభేదాలు ఉన్నాయి. విధాన సమీక్ష, మార్పుల చేర్పుల విషయంలో మన్మోహన్ ఎన్నడూ జోక్యం చేసుకోకపోవడం ఆయన గొప్పదనానికి ఒక తార్కాణం. విధాన సమీక్ష విషయమై ఆయనకు వివరించేందుకు వెళ్లినప్పుడు ఆర్థిక మంత్రితో మీ విభేదాలు పరిష్కరించుకున్నారని నేను ఆశిస్తున్నానని అనేవారు. ఆయన ఈ వ్యాఖ్య నాకు ఎంత మాత్రం సంతృప్తినిచ్చేది కాదు. అయినప్పటికీ ఆర్థిక మంత్రి అభ్యంతరాల గురించి ఆయనకు చెప్పేవాణ్ణి ఆ విషయం అంతటితో ముగిసేది. కేంద్ర బ్యాంకుతో సంబంధం లేని విషయాలపై కూడా తన భావాల మంచి చెడ్డలను తెలుసుకునేందుకు ఆయన ఆర్బీఐని ఉపయోగించుకునేవారు.


# రుణాల గవేతదారులపై చర్యలేవీ !



మోడీ అధికారంలోకి వచ్చిన తరవాత దేశాన్ని దాటిన పలువురు బ్యాంక్ రుణాల ఎగవేతదారులను ఇప్పటికీ పట్టుకోలేక పోయారు. విజయమ్ మాల్యా,నీరవ్ మోడీ వంటివారు విదేశాల్లో తలదాచుకుని బాగా ఎంజాయ్ చేస్తున్నారు. రుణాలను ఎగవేసి నింపాదిగా దేశం దాటినా వారిని వెనక్కి రప్పించలేక పోయారు. అప్పులు చేసి ఎగవేసి, దేశం విడిచిన వారి బతుకులే హాయిగా ఉన్నాయి. దేశంకోసం కష్టపడి పనిచేస్తూ ఉన్న ప్రజలు మాత్రం పన్నుల ఊబిలో చిక్కుకుని విలవిల్లాడుతున్నారు. పన్నులు, ధరల భారతంతో దేశం అతలాకుతలం అవుతోంది. దివంతగత ప్రధాని మన్మోహన్ పదేళ్ల కాలం నాటి పరిస్థితితులకు మోడీ పదేళ్ల పాలను తేడాను గమనిస్తే ..ధరలు, పన్నులు ఎంతగా పెరగాయో గమనించవచ్చు. ఆర్‌బిఐ అందించిన లెక్కల ప్రకారమే 2020లో 2,154 గా ఉన్న ఉద్దేశపూర్వక ఎగవేతదారులు 2024కి వచ్చేసరికి 2,664కు పెరిగిపోయారు. బ్యాంకులకు లక్షల కోట్ల రూపాయలు ఎగవేసే కార్పొరేట్ల నుంచి వాటిని రికవరీ చేయడానికి బదులు, ఈ కంపెనీలకు ప్రతి యేటా లక్షల కోట్ల రూపాయల రుణాలను మాఫీ చేస్తోంది. అదే సమయంలో దేశానికి అన్నం పెట్టే రైతులు సంక్షోభంలో ఉన్నారు, వారి రుణాలను మాఫీ చేయమంటే కుదరదు పొమ్మంటోంది. క్రోనీ కేపిటలిస్టులు, కార్పొరేట్లకు ప్రజల సొమ్ము దోచిపెట్టడం వల్ల బ్యాంకులకు కలిగే నష్టాలను భర్తీ చేసేందుకు డిపాజిట్లపై వడ్డీ రేట్ల తగ్గింపు, మినిమమ్ బ్యాలెన్స్ లేకుంటే పెనాల్టీలు, ప్రభుత్వ రంగ సంస్థలకు ఇచ్చే రుణాలపై అధిక వడ్డీ వసూలు వంటి పద్ధతులు అవలంభిస్తున్నాయి. బ్యాంకులను ముంచేస్తున్న వారిపై మాత్రం ఎలాంటి క్రిమినల్ ప్రొసీజర్స్ ఉండడం లేదు. బ్యాంకులకు వీరు ఎగ్గొట్టిన మొత్తం ఈ కాలంలో లక్షా 52 వేల 860 కోట్ల రూపాయల నుంచి లక్షా 96 వేల కోట్ల 441 కోట్ల రూపాయలకు చేరింది. ఇదంతా సామాన్యులు బ్యాంకుల్లో చేసుకున్న డిపాజిట్ల సొమ్మే. ఇప్పటికీ బ్యాంకు మొత్తం డిపాజిట్లలో 75 శాతం దాకా సామాన్యుల నుంచి సేకరించినవేనని ఆర్‌బిఐ నివేదికలే చెబుతున్నాయి. సామాన్యులు దాచుకున్న సొమ్మును లూటీ చేస్తున్న ఆర్థిక నేరగాళ్లలో చాలా వరకు కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి సన్నిహితులైన వ్యక్తులు, కార్పొరేట్ సంస్థలే. ఈ రుణ ఎగవేతదారుల్లో చాలా మంది నేరపూరిత కార్యకలాపాలకు పాల్పడినవారున్నారు. ఇటువంటి వారిని శిక్షించాల్సిన ప్రభుత్వం, ఆర్‌బిఐలే వారికి రక్షణగా ఉంటున్నాయి. సామాన్యులు, మధ్యతరగతి డిపాజిటర్లు పొదుపు చేసిన సొమ్ము ఉద్దేశపూర్వక ఎగవేతదారుల పాలవుతోంది. బ్యాంకులకు రుణబకాయిలు చెల్లించే అవకాశం ఉన్నప్పటికీ, ఉద్దేశపూర్వకంగా ఎగవేసే క్రోనీ కేపిటలిస్టులు, కార్పొరేట్లు మోడీ ఏలుబడిలో రోజురోజుకూ పెరిగిపోతున్నారు. 2023 జూన్ 3న ఆర్‌బిఐ జారీ చేసిన సర్క్యులర్‌లో ఉద్దేశపూర్వక ఎగవేతదారులు, ఆర్థిక మోసాలకు పాల్పడినవారితో రాజీ ఒప్పందాలు కుదుర్చుకోవాలని బ్యాంకులకు సూచించింది. 2016లో తీసుకొచ్చిన దివాలా కోడ్ బ్యాడ్ లోన్స్‌ను థర్డ్ పార్టీకి విక్రయించాలని బ్యాంకులను ఆదేశిస్తోంది. మాచార హక్కు చట్టం (ఆర్‌టిఐ) ద్వారా దాఖలు చేసిన అర్జీకి ప్రతిస్పందనగా టాప్ 100 మంది ఉద్దేశపూర్వక ఎగవేతదారుల వివరాలను ఆర్‌బిఐ వెల్లడించి చేతులు దులిపేసుకుంది. 2018లో దేశం విడిచి పారిపోయిన నీరవ్‌మోడీకి చెందిన గీతాంజలి జెమ్స్ బ్యాంకులకు రూ.8,516 కోట్లు బకాయి పడింది. ఇదే అత్యధిక మొత్తం ఎగవేతదారుగా ఉంది. ఇప్పుడే కాదు, ఇంతకుముందు కూడా అది భారీగా రుణాన్ని ఎగవేసింది. ఎన్ని సార్లు ఎగవేసినా ఏమీ కాదు అన్న వాతావరణాన్ని ప్రభుత్వమే కల్పించాక ఎగవేత దారులు పెరగకుండా ఎలా ఉంటారు. గత పదేళ్లలో మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు మాఫీ చేసిన రుణాలు అక్షరాలా 16.11 లక్షల కోట్ల రూపాయలు. అంతకుముందు మన్మోహన్ సింగ్ ప్రభుత్వం పదేళ్లలో మాఫీ చేసినదాంతో పోల్చితే ఇది ఎనిమిది రెట్లు ఎక్కువ. వామపక్షాల ఒత్తిడి ఫలితంగా యుపిఏ-1 ప్రభుత్వం అప్పట్లో రూ. 60 వేల కోట్ల మేర వ్యవసాయ రుణాలను మాఫీ చేస్తే ఇది దండగమారిన చర్యగా గగ్గోలు పెట్టిన 'ప్రధాన ప్రవంతి మీడియా' ఈ రుణ ఎగవేతలపై ఒక్క ముక్క కూడా ప్రస్తావించడం లేదు. అమెరికా లాంటి దేశాల్లో పారుబకాయిలు ఒక శాతం కంటే తక్కువగా ఉంటే భారత్‌లో ఇది 7.85 శాతంగా ఉన్నాయి. ఆర్‌బిఐ మార్గదర్శకాల ప్రకారం బ్యాంకులు ఇచ్చే మొత్తం రుణాల్లో వ్యవసాయ రంగానికి 40 శాతం ఇవ్వాలి. కానీ, 12 శాతానికి మించి ఇవ్వడం లేదు. క్రోనీ కేపిటలిస్టులు, కార్పొరేట్ల పట్ల వున్న ప్రేమ వ్యవసాయంపై మోడీ ప్రభుత్వానికి లేదనడానికి ఇదొక నిదర్శనం. ప్రభుత్వ రంగ బ్యాంకులను ఒక వైపు ప్రైవేటీకరిస్తూ, ఇంకో వైపు ఉన్న బ్యాంకులను కూడా దివాలా తీయించే చర్యలు ప్రభుత్వం చేపడుతోంది. దీనికి వ్యతిరేకంగా బ్యాంకు సిబ్బంది పలుమార్లు సమ్మె చేసినా ప్రభుత్వం లెక్కచేయడం లేదు. ఈ స్థితిలో బ్యాంకులకు పెద్ద యెత్తున రుణాలను ఉద్దేశపూర్వకంగా ఎగవేసిన వారి నుంచి తిరిగి రాబట్టేలా చూసేందుకు బ్యాంకు ఉద్యోగులతోబాటు ప్రజలు పెద్దయెత్తున ఉద్యమించాలి. ఆర్థిక నేరగాళ్లను బోనులో నిలబెట్టాలి. అప్పుడే దేశ ఆర్థిక వ్యవస్థపై భారం తప్పుతుంది. ఇకపోతే పన్నుల విధానం సవరించకుండా ముందుకు సాగలేం. ద్రవ్యోల్బణం పెరుగుతోంది. రూపాయి విలువ రోజురోజుకూ దిగజారుతోంది. ఈ పరిస్థితిలో పివి అనుసరించిన మార్గం మేరకు మరో ఆర్థికవేత్త రావాల్సి ఉంది. అప్పుడే భారత్ ఆర్థికరంగం పురోగమించగలదు.

# పత్తి రైతుకు 'మద్దతు' లభించేదెప్పుడు?

మన దేశం పత్తి సాగులో ప్రపంచంలోనే మూడో స్థానంలో ఉంది. ఇక దేశంలో మహారాష్ట్ర, గుజరాత్ తర్వాత తెలంగాణ రాష్ట్రం మూడో స్థానంలో ఉంది. ఆసియాలోనే డిమాండ్ ఉన్న తెలంగాణ పత్తి గురించి అందరూ చెప్పుకుంటున్నా, దాన్ని సాగు చేస్తున్న రైతుకు మాత్రం సాయం దక్కడం లేదు. పత్తి సాగు చేస్తున్న రైతులకు ఏటా మద్దతు ధర ప్రకటించడం వరకే ప్రభుత్వాలు ఆలోచిస్తున్నాయి. అది కూడా కంటితుడుపు చర్యగానే. ఏటా ఎరువులు, పురుగు మందుల ఖర్చు విపరీతంగా పెరిగిపోతోంది. దీనికితోడు స్థానికంగా ఉన్న భూమి, వాతావరణ పరిస్థితులు పత్తి పంట సాగులో ఇబ్బందులు తెచ్చిపెడుతున్నాయి. ఇక్కడ ప్రధానంగా చెప్పుకోవాల్సిన విషయమేంటంటే 60శాతం మంది కౌలు రైతులే. దీంతో పత్తిపంట సాగు చేసేందుకు వీరు కౌలు రూపంలో అదనంగా చెల్లించాల్సిన పరిస్థితి. మరోవైపు యాంత్రీకరణ వల్ల పనిముట్ల ధరలు, కూలీల రేట్లు అమాంతం పెరిగి రైతుకు పెట్టుబడి పెరుగుతోంది. దీనికితోడు బ్యాంకులు ఇచ్చే అప్పు సరిపోక, వడ్డీకి తెచ్చి పంట సాగు చేస్తే చివరకు పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షాలతో పంట నేలపాలవుతోంది. పత్తి ఏరేందుకు కూలీలను పిలిస్తే వారికి కిలోకు పది నుంచి పదిహేను రూపాయలు చెల్లించాల్సి వస్తోంది. పంటను పొలంలో వదిలేయలేక ఇంటికి తెచ్చి అమ్ముకుందామంటే మార్కెట్లో తేమ, గూడు, రంగు మారిందని సీసీఐ కొనుగోలుకు ఆదిలోనే నిరాకరిస్తోంది. దీంతో రైతుల కష్టం పరోక్షంగా దళారుల పాలవుతోంది. తేమ 8 నుంచి 12 శాతం లోపు ఉంటేనే కొంటామని చెప్పడం, మద్దతు ధర రూ.7,525గా నిర్ణయించడంతో రైతులు వర్షానికి తడిసిన పత్తిని సీసీఐకి అమ్మలేక, ఇంటికి తీసుకెళ్లలేక చివరకు వ్యాపారులు నిర్ణయించిన ధరకే అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఫలితంగా ఈ



ఏడాది పత్తి రైతులకు మార్కెట్లో వ్యాపారులు ఇచ్చిన ధర అక్షరాలా.. 6700 నుంచి 6900 మాత్రమే. ఇక చివరలో సీసీఐ కొనుగోలు చేసినా, తేమ తక్కువైనా మద్దతు ధర మాత్రమే లభించింది ఈ ఏడాది రాష్ట్రంలో నల్గొండ, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, సంగారెడ్డి, వికారాబాద్, వరంగల్, ఖమ్మంతో పాటు ఇతర జిల్లాల్లో అధికంగా పత్తిపంట సాగు చేశారు. మిగతా జిల్లాల్లో కాస్త తక్కువగానే పత్తిపంట సాగైందని వ్యవసాయ శాఖ చెబుతున్నది. మరి రాష్ట్రంలో సాగవుతున్న పత్తి పంటకు ఎకరానికి అవుతున్న ఖర్చెంత.. లభిస్తున్న ధర ఎంత.. రైతుకు ఎంత దక్కుతున్నదో తెలిస్తే.. అసలు వ్యవసాయం చేసే రైతుల పరిస్థితి ఇంత దయనీయంగా ఉంటుందా అనిపిస్తుంది. పత్తి రైతుకు ఎకరానికి 65వేల నుంచి 75వేల వరకు ఖర్చవుతుంది. దళారుల వద్ద అప్పు తెస్తే నూటికి 25శాతం వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. అంటే 20వేల వరకు వడ్డీ చెల్లించాల్సిందే. అంటే ఎకరానికి మొత్తం 95వేల వరకు ఖర్చవుతుంది. ఎకరానికి చెలక అయితే 8 క్వింటాళ్లు, నల్లరేగడి అయితే 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. క్వింటాలు పత్తిని మార్కెట్లో సీసీఐ ద్వారా విక్రయిస్తే ధర 7,525 రూపాయలు అనుకుంటే సుమారు 12 క్వింటాళ్ల పత్తి అమ్మితే 90,300 రూపాయలు వస్తాయి. మిగతాది రైతు జేబులో నుంచే అప్పు చెల్లించాలి. ఇక దిగుబడి తగ్గితే అప్పుల్లో కూరుకుపోవడమే. అదే తేమ అధికంగా ఉందని సీసీఐ నిరాకరించిన పత్తిని ప్రయివేటు వ్యాపారులకు అమ్మితే ధర 6,950గా నిర్ణయించినా, తేమ పేరుతో వారు 6,700 మాత్రమే చెల్లిస్తున్నారు. ఈ లెక్కన 80,400 రూపాయలు మాత్రమే రైతుకు దక్కుతోంది. ఇక ప్రకృతి సహకరించక పంట నష్టపోతే అది అదనమే. ఇక ప్రభుత్వం కనీస మద్దతు ధర అంటూ ఆర్భాటం చేస్తున్నా.. అది కూడా రైతుకు దక్కడం లేదు. అందువల్ల కార్పొరేట్ వ్యాపారులు ఎలా అయితే తమ ఉత్పత్తులకు తామే ధర నిర్ణయించి అమ్ముకుంటున్నారో, అలాగే రైతులకు కూడా ధర నిర్ణయించి విక్రయించుకునే వెసులుబాటు కల్పించాలి. రైతు వద్దకే వచ్చి పంట కొనుగోలు చేసే రోజులు రావాలి. బ్యాంకులు ఇచ్చే రుణాల పరిమితి పెంచాలి. ప్రభుత్వం రైతు భరోసా, రుణమాఫీ అంటూ ఆర్భాటపు ప్రచారాలు కాకుండా, రైతులకు ఏది అవసరమో.. పంట అమ్ముకునేందుకు ఏ విధంగా చర్యలు తీసుకుంటే వారికి లాభసాటిగా ఉంటుందో చూడాలి. నష్టమొస్తే దాన్ని భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలి. రైతుకు సాయం కాదు.. పెట్టుబడి ఖర్చులు పోగా అతడు తన కుటుంబాన్ని పోషించుకునేందుకు అయినా కాస్త మిగిలేలా చూడాలి. అప్పుడే పత్తి రైతు నిలదొక్కుకోగలడు

# విధి నిర్వహణలో మరింత పారదర్శకత, జవాబుదారీతనం కోసం శరీరానికి ధరించే కెమెరాలను ప్రవేశపెట్టిన రాచకొండ ట్రాఫిక్ పోలీసులు

ప్రజా స్వేచ్ఛ

ఈ కెమెరాలు ప్రజలు మరియు ట్రాఫిక్ సిబ్బందికి మధ్య నమ్మకం పెంచుతాయి:సిపి సుధీర్ బాబు ఐపిఎస్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో పారదర్శకత పెంచేలా క్షేత్ర స్థాయిలో విధులు నిర్వర్తించే సిబ్బందిలో జవాబుదారీతనం మరియు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించడం కోసం రాచకొండ ట్రాఫిక్ పోలీసు సిబ్బంది శరీరానికి ధరించే కెమెరాలను ప్రవేశపెట్టడం జరిగింది. నేరేడ్‌మెట్‌లోని రాచకొండ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో (50) శరీరానికి ధరించే కెమెరాలు రాచకొండ ట్రాఫిక్ విభాగపు సబ్-ఇన్‌స్పెక్టర్లు మరియు ఇన్‌స్పెక్టర్‌లు వంటి ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్‌లకు సిపి శ్రీ జి. సుధీర్ బాబు, ఐపిఎస్ గారి చేతుల మీదుగా అందజేశారు. ఈ కెమెరాలను అధికారులు విధి నిర్వహణలో ఉన్నప్పుడు ధరిస్తారు. తద్వారా ప్రజలతో వారి ప్రవర్తన మరియు పరస్పర చర్యలు రికార్డ్ అవుతూ ఉంటాయి.

**ఈ విధానం యొక్క లక్ష్యం:**

1.పారదర్శకత మరియు జవాబుదారీతనం: శరీరానికి ధరించే కెమెరాల ద్వారా ట్రాఫిక్ అధికారులు మరియు ప్రజల మధ్య జరిగే పరస్పర చర్యలు రికార్డ్ చేయబడి వివాదాలు మరియు ఫిర్యాదుల అవకాశం తగ్గుతుంది.

2.అధికారుల ప్రవర్తన మెరుగుపడుతుంది: వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించడం ద్వారా, విధుల్లో ఉన్నప్పుడు అత్యున్నత ప్రమాణాల ప్రవర్తనకు కట్టుబడి ఉండేలా అధికారులను ఈ కెమెరాలు ప్రేరేపిస్తాయి.

3.మెరుగైన ప్రజా విశ్వాసం: అధికారులు మరియు సిబ్బంది యొక్క ప్రవర్తనా చర్యలు ఎప్పటికప్పుడు



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

రికార్డు అవడం ద్వారా ప్రజలకు నమ్మకం పెరగడంతో పాటు అధికారులతో ప్రజలు సంయమనంతో, సవ్యంగా వ్యవహరించేందుకు అవకాశం ఉంటుంది. 4.ఖచ్చితమైన సాక్ష్యాధారాల సేకరణ: ట్రాఫిక్ ఉల్లంఘనలు, వివాదాలు లేదా పరిశోధనల విషయంలో రికార్డ్ చేయబడిన ఫుటేజ్ నమ్మదగిన సాక్ష్యంగా ఉపయోగపడుతుంది. ఈ సందర్భంగా రాచకొండ పోలీస్ కమిషనర్ శ్రీ జి. సుధీర్ బాబు, IPS, గారు మాట్లాడుతూ, "ట్రాఫిక్ విభాగ పనితీరు ఆధునీకరించడానికి మరియు పోలీసులకు మరియు ప్రజలకు మధ్య విశ్వాసాన్ని పెంపొందించడానికి చేస్తున్న విశేష ప్రయత్నాలలో భాగంగా శరీరానికి ధరించే కెమెరాల పరిచయం ఒక మైలురాయి వంటిదని పేర్కొన్నారు. రహదారి భద్రతను మరింతగా పెంచడమే కాక ప్రజలు మరియు పోలీసుల మధ్య పారదర్శక వ్యవస్థను మరింతగా పెంపొందించడానికి వీలైనంత ఎక్కువగా సాంకేతికతను ఉపయోగిస్తామని ఈ సందర్భంగా కమిషనర్ పేర్కొన్నారు. శరీరానికి ధరించే కెమెరాల వాడకం అధికారుల వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించడమే కాకుండా పోలీసు డిపార్ట్‌మెంట్‌పై ప్రజలకు నమ్మకం మరియు విశ్వాసాన్ని పెంపొందిస్తుందని సిపి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిసిపి ట్రాఫిక్ -II వి.శ్రీనివాసులు, డిసిపి ట్రాఫిక్ -1 ఎస్. మల్లా రెడ్డి, డిసిపి ఎస్‌ఓటి-I ఎ. రమణా రెడ్డి, డిసిపి ఎస్‌ఓటి -II K. మురళీధర్, S. ప్రదీప్ బాబు, ఇన్స్పెక్టర్ eChallan, రామ లక్ష్మణ రాజు, SHO-కుషాయిగూడ ట్రాఫిక్ పీఎస్, B. నరసింహ, SHO-మల్కాజిగిరి ట్రాఫిక్ పీఎస్,ఇన్స్పెక్టర్లు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, సబ్-ఇన్స్పెక్టర్లు మరియు ఇతర ట్రాఫిక్ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

**-తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి ఒక ప్రకటనలో తెలియజేశారు.**

# నేడు ఆకాశంలో బ్లాక్ మూన్!

హైదరాబాద్: ప్రజా స్వేచ్ఛ



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

2024 సంవత్సరం ముగియడానికి ఇంకా ఒక్క రోజు మాత్రమే మిగిలి ఉంది. డిసెంబర్ 30వ తేదీ రాత్రి ఆకాశంలో అరుదైన దృశ్యం కనిపించనుంది. అవును,ఈ రాత్రి అంతరిక్ష ప్రపంచంలో అపూర్వమైన ఖగోళ ఘట్టం జరగనుంది. ప్రతి సంవత్సరం ప్రజలు నీలి చంద్రుడు, పౌర్ణమి, సూపర్ మూన్,సూర్యగ్రహణం, ఉల్కలు,రంగురంగుల లైట్లు, గ్రహాలు మొదలైన వాటిని చూశారు. కానీ,ఈ రోజు డిసెంబర్ 30 న సోమవతి అమావాస్య రాత్రిని చూస్తారు .ఇది ఈ నెలలో రెండవ అమావాస్య అవుతుంది. ఎందుకంటే అంతకు ముందు డిసెంబర్ 15 న ప్రపంచం చల్లని చంద్రుడిని చూసింది. ఈ రాత్రి నల్లని చంద్రుడు ఉదయించి నప్పుడు,ఆకాశం పూర్తి నల్లగా మారుతుంది. నక్షత్రాలు,గ్రహాలను చూడటానికి ఈ రాత్రి చాలా ప్రత్యేకంగా ఉంటుంది. తక్కువ కాంతి కారణంగా, నక్షత్రరాశు లు,గ్రహాల వీక్షణ ఖగోళ శాస్త్ర ప్రియులకు మరింత అద్భుతంగా మారుతుంది. ఈ సంఘటన ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఖగోళ శాస్త్ర ప్రియులను ఆశ్చర్య పరిచేదిగా కనిపిస్తుంది. బ్లాక్ మూన్ అంటే ఏమిటి? బ్లాక్ మూన్ అంటే చంద్రుని రంగు నల్లగా మారుతుందని కాదు,ఒక నెలలో రెండవ అమావాస్య సంభ వించినప్పుడు.. బ్లాక్ మూన్ అనేది ఏర్పడు తుంది. అది ఒక అరుదైన ఖగోళ దృగ్విషయం. ఇది పౌర్ణమి తో వచ్చే బ్లూ మూన్ ఈవెం ట్‌ను పోలి ఉంటుంది. ఖగోళ శాస్త్ర ప్రేమికులు దీనిని ప్రత్యేకంగా భావిస్తారు.

**-తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి ఒక ప్రకటనలో తెలియజేశారు.**

# మంగళవారం రాత్రి ఫ్లైఓవర్లు బంద్






తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

ప్రజా స్వేచ్ఛ

న్యూ ఇయర్ వేడుకల నేపథ్యంలో హైదరాబాద్ లో పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్లున్నారు. ఈ క్రమంలో నగరంలోని అన్ని ఫ్లై ఓవర్లను బంద్ చేయాలని పోలీసులు నిర్ణయించారు. డిసెంబర్ 31న రాత్రి 10 గంటల తర్వాత బైకులు, వాణిజ్య వాహనాలకు ఫ్లై ఓవర్లకు అనుమతి ఉండదని పోలీసులు తెలిపారు. గత ఏడాది అనుభవాల దృష్ట్యా అతివేగంతో దూసుకెళ్లే ప్రమాదం పొంచి ఉందని ఈ నిర్ణయం తీసుకున్నారు.

**పోలీసుల ప్రత్యేక దృష్టి**

న్యూ ఇయర్ వేడుకలపై తెలంగాణ పోలీస్ శాఖ ప్రత్యేకంగా నిఘా వేస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం డ్రగ్స్ రహిత తెలంగాణ, డ్రగ్స్ రహిత హైదరాబాద్ లక్ష్యాలను నిర్దేశించిన నేపథ్యంలో పోలీస్ శాఖలోని అన్ని విభాగాలు న్యూ ఇయర్ వేడుకలపై ఫోకస్ చేశాయి. ముఖ్యంగా హైదరాబాద్ నగరంతో పాటు నగర శివారుల్లో జరిగే పార్టీలపై ప్రత్యేకంగా నిఘా పెట్టనున్నట్టు తెలుస్తోంది. అలాగే పలు జిల్లాల్లోని ముఖ్య నగరాల్లో, ఫామ్ హౌస్‌లు, బార్లు, రెస్టారెంట్లు, పబ్‌లు, హోటళ్లపై పోలీస్ శాఖ ఓ కన్నేసి ఉంచింది. న్యూ ఇయర్ వేడుకలపై సివిల్ పోలీస్‌తో పాటు నార్కోటిక్, ఎక్సైజ్, ఎస్‌ఓటి పోలీస్ విభాగాలు కూడా అలర్ట్ అయ్యాయి. వేడుకల్లో భాగంగా ఆకస్మిక తనిఖీలకు ప్లాన్ చేసుకున్నట్టు సమాచారం. ఇందులో భాగంగానే ఇప్పటికే హైదరాబాద్, మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బార్ అండ్ రెస్టారెంట్స్, పబ్స్ , హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు ప్రారంభించారు. బార్లు, పబ్‌ల లైసెన్స్ తనిఖీ చేశారు.

**మైనర్లను అనుమతిస్తే కేసులే**

కొత్త ఏడాది వేడుకల్లో మైనర్లను బార్లు, పబ్‌లకు అనుమతిస్తే కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. డీజేలతో హంగామా చేయవద్దని, నిషేధానికి సహకరించాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా సౌండ్ పొలుష్యన్‌కు కారణంగా కాకుండా చూసుకోవాలని పబ్ యజమానులకు ఆదేశాలిచ్చారు.

# మానవత్వం చాటిన శ్రీశ్రీ విశ్వబ్రాహ్మణ సంఘం



మహేశ్వరం నియోజకవర్గం ప్రజా స్వేచ్ఛ

నాగర్ కర్నూల్ జిల్లా పదరా మండలం ఓంకేశ్వరం గ్రామానికి చెందిన ఉప్పునుంతల కృష్ణమాచారి ఆరోగ్యపరిస్థితి క్షీణించడంతో, కుటుంబ సభ్యులు ఉస్మానియా ఆసుపత్రిలో చేర్పించగా ఆయన రెండు కిడ్నీలు పాడయ్యాయని డాక్టర్లు తెలిపారు. ఆయనకు భార్య, ఒక కూతురు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ సమాచారం తెలుసుకున్న శ్రీశ్రీ విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు ఉప్పునుంతల వెంకటేశ్వర్లు కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని నిర్ణయించి వారికి ఆర్థిక సహాయం నగదు రూపంలో అందించారు. ఈ సహాయం చేసిన వారు శ్రీశ్రీ విశ్వబ్రాహ్మణ సంగం అల్మాస్గూడ ఉపాధ్యక్షుడు తిరుపతి చారి, యువ జన నాయకుడు వీర చారి, తెలంగాణ మను మాయ సంగం కోశాధికారి అవాంఛ మురళీ చారి, మరియు సంగం సభ్యులు రఘునందన్ చారి, నారోజు రాజుచారి, మలేష్ చారీ, రామ లింగాచారి, గోవర్ధన్ చారి, రాజేష్ చారి, రూపా చారి, శ్రీకాంత్ చారీ, హరికృష్ణ చారి, శ్రవణ్ చారి, పరిపూర్ణా చారి, సంతోష్ చారి,వెంకటనర్సిమ్మా చారి మరియు శ్రీనాథస్వామి, ప్రభాకర్ తదితరలు.

# మెదక్ జిల్లా ఫోటో వీడియో గ్రాఫర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా కంచి

ప్రజా స్వేచ్ఛ మెదక్ :



మెదక్ ఫోటో , వీడియోగ్రాఫర్ సంక్షేమ సంఘం శ్రీ వెంకటేశ్వర గార్డెన్ లో ఎన్నికలు నిర్వహించారు . ఎన్నికలలో మెదక్ జిల్లా లోని 21 మండలంలోని ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్స్ పాల్గొన్నారు. జిల్లా ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ సంక్షేమ సంఘం ఎన్నికలకు కంచి ఆనంద్, బిట్ల నర్సింలు పోటీలో నిలువగా బిట్ల నర్సింహులపై కంచి ఆనంద్ 15 ఓట్లతో గెలుపొందారు. ఈ ఎన్నికల కొరకు రాష్ట్ర సంఘం సభ్యులు రాష్ట్ర సెక్రటరీ సిరి రవి, రాష్ట్ర కోశాధికారి మాధవరెడ్డి, కుటుంబ భరోసా ఇన్చార్జి నాగరాజు, రాష్ట్ర సలహాదారులు కేదార్ నాథులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు కంచి ఆనంద్ కు రాష్ట్ర కమిటీ శాలువా కప్పి. ఎన్నికైన పత్రాన్ని అందజేశారు. ఈ ఎన్నికలు కృష్ణ, శశివర్ధన్ రెడ్డి, రామకృష్ణ, బసవరాజ్ , రామకృష్ణ ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్, మన్నే శ్రీనివాస్, చింతల రవీందర్,, వంశీ, సురేందర్, లక్ష్మణ్, స్వరూప, విక్రమ్, రాజు,హరీష్, మహిపాల్, నర్సా గౌడ్, సంతోష్, ఎల్లం ప్రదీప్ రెడ్డి, మహేష్, విగ్నేష్, అశోక్ మరియు జిల్లాలోని ఫోటో,వీడియో గ్రాఫర్లు పాల్గొన్నారు.

# చోరీకి గురైన ద్విచక్ర వాహనం అప్పగించిన పోలీసులు

వరంగల్ ప్రజా స్వేచ్ఛ



చోరీకి గురైన ద్విచక్ర వాహనాన్ని వెతికి వాహనదారుడికి వరంగల్ ట్రాఫిక్ పోలీసులు అప్పగించారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న ఎండీ సాజిద్ పాషా విధుల్లో భాగంగా వరంగల్ రైల్వే స్టేషన్ లో విధులు నిర్వహిస్తుండగా టిఎస్ 27ఏ 3296 నంబర్ గల హీరో గ్లామర్ కంపెనీకి చెందిన ద్విచక్ర వాహనం అనుమానస్పదంగా కనిపించడంతో పూర్తి వివరాలు తెలుసుకొని ఫోన్ చేయగా,సదరు వ్యక్తి తాను జోగు మహేందర్ అని దేవరుప్పుల మండలంలోని సింగరాజుపల్లి గ్రామంలో తన ఇంటి ముందు నిలిపిన వాహనాన్ని,గుర్తు తెలియని వ్యక్తి తన బైక్ దొంగిలించాడని చెప్పారు. దీంటి పోలీసులు సదరు వాహనదారుడికి బండి దొరికిందని, వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లో బండి ఉందని సాజిత్ చెప్పగా, వరంగల్ ట్రాఫిక్ సిఐ రామకృష్ణ సదరు బండి యజమానికి బండి అప్పగించారు. బండి దొరకడంలో చురుకైన పాత్ర పోషించిన ట్రాఫిక్ కానిస్టేబుల్ ఎండి సాజిద్ పాషాను ట్రాఫిక్ సిఐ రామకృష్ణ అభినందించారు.

# బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకి కౌన్సెలింగ్ ఇచ్చిన ఏసీపీ



**కూకట్ పల్లి ప్రజా స్వేచ్ఛ**

బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు సోమవారం బాలానగర్ ఏసీపీ హనుమంతా రావు కౌన్సెలింగ్ ఇచ్చారు. రానున్న నూతన సంవత్సర వేడుకల దృష్టిలో ఉంచుకొని బాలానగర్ పోలీస్ స్టేషన్ పరధిలో ఉన్న 12 మంది రౌడీషీటర్లకు.. సస్పెక్ట్ షీటర్లకు ఈ రోజు బాలానగర్ ఏసీపీ కార్యాలయంలో కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్ల కదలికలను ఎప్పటికప్పుడు గుర్తిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా వీరిపై పోలీసు నిఘా కూడా ఉందని పేర్కొన్నారు. వచ్చే నూతన సంవత్సర వేడుకలలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయని, అంతేకాక జైలుకు తరలిస్తామని హెచ్చరించారు. గతంలో నేరాలకు పాల్పడిన వారు నేర ప్రవృత్తిని వీడి సమాజంలో మంచి నడవడికతో కొనసాగాలని, హుందాగా జీవించాలని సూచించారు. నేరస్తుల తొందరపాటులో నేరాలు చేసినా వారి కుటుంబ సభ్యులు సమాజంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. నేరాలకు దూరంగా ఉంటూ మంచి ప్రవర్తన కలిగి ఉండే వారిపై షీట్ ఏతివేస్తామని ఆఫర్ ఇచ్చారు, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని మారండని రౌడీ షీటర్లకు ఏసీపీ హితవు పలికారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఐ సుభాష్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా అయ్యప్ప స్వామి పడిపూజ మహోత్సవం



**కూకట్ పల్లి ప్రజా స్వేచ్ఛ**

బాలానగర్ డివిజన్ రాజు కాలనీలో సోమవారం శ్రీనివాస్ గౌడ్ మల్లికార్జున గౌడ్ ల ఆధ్వర్యంలో హరిహరపుత్ర అయ్యప్ప స్వామి పడిపూజ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్, ముఖ్యఅతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం భక్తులకు అన్నసంతర్పణ చేశారు నాయకులు పుష్పరెడ్డి ,లక్ష్మయ్య, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమిలో సూచిక బోర్డు ఏర్పాటు

**-అతి త్వరలోనే సర్వే చేసి సరిహద్దులు గుర్తించి ప్రభుత్వ భూమిని కాపాడుతాం**




కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, సూరారం గ్రామంలో సర్వేనెంబర్ 166,167 లో ఎకరం 10 గుంటలు ప్రభుత్వ భూమి బి ఆర్ ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి కి చెందిన సీఎంర్ స్కూల్ /బిల్డింగులు ఆక్రమించుకొని ఆక్రమణ నిర్మాణం/అక్రమ వినియోగంపై 2017 లోనే రెవెన్యూ అధికారులు బోర్డు నాటడమే కాకుండా ఆక్రమించుకుంటే చర్యలు తీసుకుంటామని నోటీసులు ఇచ్చిన బోర్డు తీసేసి దర్జాగా ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకొని వాడకంపై డిసెంబర్ 24-2024 డిప్యూటీ ఎమ్మార్వో, ఆర్డీవోకి బిజెపి నాయకులు ఆకుల సతీష్ ,నల్ల జై శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో పూర్తి ఆధారాలతో ఫిర్యాదు చేయగా సోమవారం కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూములు గుర్తించి బోర్డు నాటడం కాకుండా, అతి త్వరలోనే సర్వే చేసి సరిహద్దులు గుర్తించి ఫెన్సింగ్ వేసి రక్షిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ అసెంబ్లీలో నగనాసి మాటలు చెప్పే మాజీ మంత్రి మల్లారెడ్డి ఇప్పుడు తన స్కూల్లో ప్రభుత్వ భూమి ఆక్రమణ పై సమాధానం చెప్పాలని డిమాండ్ చేయడమే కాకుండా ఫిర్యాదు మేరకు చర్యలు తీసుకున్నా హైడ్రా, రెవెన్యూ అధికారులకు ధన్యవాదాలు చెప్పారు.

# మందాడి! ఆ మందకు మోసం చేసి? ఈ మందలో చేరావు!!!

- -అక్రమ నిర్మాణాలు చేపడుతూ అభివృద్ధిపైల ప్రశ్నిస్తావా?
- -హౌసింగ్ బోర్డ్ స్థలాన్ని కబ్జా చేసి అక్రమ నిర్మాణం చేపట్టావు
- -కార్పొరేటర్ గా ఉంటూ అక్రమ నిర్మాణాలు చేపట్టి కోట్లాది రూపాయలు సంపాదించావు
- -టిడిపిలో ఉండి ఎన్టీఆర్ మనవరాలని వెన్నుపోటు పొడిచావు
- -లోపాయికారిగా టిఆర్ఎస్ కు ఓట్లు వేయించిన చరిత్ర కార్పొరేటర్ మందాడిది
- -టిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కూడా కార్పొరేటర్ గా ఉన్నావ్
- -ఆనాడు అభివృద్ధిపై ఎందుకు ప్రశ్నించలేదు
- -కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అభివృద్ధిపై వినతి పత్రాలు ఇస్తావా?
- -మందడి శ్రీనివాసరావు నీవు కార్పొరేటర్ కాకముందు ఆస్తి ఎంత అయ్యాక ఎంత?
- -బహిరంగ చర్చకు సిద్ధమా?



**కూకట్ పల్లి ప్రజా స్వేచ్ఛ**

అభివృద్ధిపై అధికారులకు వినతిపత్రం సమర్పిస్తున్న కె.పి.హెచ్.బి(114) డివిజన్ కార్పొరేటర్ టిఆర్ఎస్ సమయంలో అభివృద్ధిపై ఎందుకు ప్రశ్నించలేదని. తమ్మినేని ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు. తెలుగుదేశం కార్పొరేటర్ గా గెలుపొంది 2018 సార్వత్రిక ఎన్నికల్లో మహా కూటమి అభ్యర్థిగా పోటీ చేసిన నందమూరి సుహాసిని కి మోసం చేసింది మందడి శ్రీనివాసరావు కాదా అని ప్రశ్నించారు. లోపాయికారికంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తో చేతులు కలిపి ఆమెను ఓడించడంలో ప్రధాన పాత్ర పోషించారు. దాంతో నందమూరి సుహాసిని కి సమాధానం చెప్పలేక మందడి శ్రీనివాసరావును ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు టిఆర్ఎస్ పార్టీలోకి తీసుకొని టికెట్ ఇచ్చి కార్పొరేటర్ గా గెలిపించుకున్నది నిజం కాదా అని ప్రశ్నించారు. పిడికిటి గోపాల్ చౌదరి స్థానిక కార్పొరేటర్ గా ఉంటూ హౌసింగ్ బోర్డ్ కు చెందిన స్థలంలో అక్రమ నిర్మాణం చేపట్టి అపార్ట్మెంట్ ఫ్లాట్స్ విక్రయించారని ఆరోపించారు. బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు 100% అభివృద్ధి పనులు పూర్తయ్యాయని ప్రకటనలు ఇచ్చిన మీరు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సమస్యలు గుర్తుకు వచ్చాయా అని ప్రశ్నించారు. హౌసింగ్ బోర్డు ప్రభుత్వ స్థలంలో కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు నిర్మించిన అక్రమ నిర్మాణం గురించి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని అన్నారు. ప్రజల ఆస్తులను కాపాడాల్సిన ప్రజాప్రతినిధి ఏకంగా హౌసింగ్ బోర్డ్ స్థలం కబ్జా చేసి అక్రమ నిర్మాణం నిర్మించడం అంటే కంచె చేనును మేసిన చందంగా ఉందన్నారు. దమ్ముంటే మందడి శ్రీనివాసరావు హౌసింగ్ బోర్డ్ ప్రభుత్వ స్థలం కబ్జా చేయలేదా? ధైర్యం ఉంటే బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. భవిష్యత్తులో కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు ఆక్రమణలు ప్రజల ముందు పెడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బి బ్లాకు అధ్యక్షురాలు సంధ్య ఏఎంసీ డైరెక్టర్ కోకిలగడ్డ ఫణి కుమార్ డివిజన్ అధ్యక్షురాలు రజిత యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రంగస్వామి పొన్నం సాయి తేజ మహిళ నాయకురాలు థర్డ్ ఫేస్ రేణుక మరియు ఫోర్త్ ఫేస్ రేణుక పాల్గొన్నారు.

# తెలంగాణ రెవిన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఖేడ్ నూతన కార్యవర్గం ఎన్నిక





**నారాయణఖేడ్, ప్రజా స్వేచ్ఛ**

నారాయణఖేడ్ పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం తెలంగాణ రెవిన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నూతన కార్యావర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం వ్యవస్థాపకులు లచ్చిరెడ్డి ఆదేశాల మేరకు సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మర్రి ప్రదీప్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్,పి. సతీష్,జిల్లా అసోసియేట్ అధ్యక్షులు తలారీ శ్రీనివాస్,ట్రెజరర్ రాజు గౌడ్,కార్యవర్గ సభ్యులు మహేష్, చంద్రశేఖర్ ల ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఖేడ్ నూతన అధ్యక్షులుగా కె.అనీల్ రెడ్డి,ఉపాధ్యాక్షులుగా ఎండి నాసర్ హుస్సేన్, కె. సునీత,ప్రధాన కార్యదర్శిగా జి.వినోద్ కుమార్,అసోసియేట్ అధ్యక్షులుగా ఫజల్ రెహమాన్, రాంచెందర్, కార్యదర్శులుగా డేవిడ్,రజిని, నదీమ్, శ్రీకాంత్, శంకర్,కోశాధికారిగా వాజీద్,సహాయ కోశాధికారులుగా ఎం. శ్రీకాంత్,ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా సంపత్ కుమార్, రహూఫ్,అడ్వైజరీ బోర్డు సభ్యులుగా విష్ణు,లతీఫ్,క్రీడలు మరియు సాంస్కృతిక కార్యదర్శులుగా కె. జయశీల,మాణిక్ రాథోడ్,హన్మండ్లు, శ్రీకాంత్,ఈసి సభ్యులుగా పండరి, రహమత్ ఉన్నిసా బేగం,శంకర్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఖేడ్ మండల తహసీల్దార్ భాస్కర్,సిర్గాపూర్ మండల తహసీల్దార్ ఉమాశంకర్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# కార్మికునికి రావలసిన గ్రాడ్యుయేట్ డబ్బులు ఇప్పించిన

**-బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్...**




**కూకట్ పల్లి ప్రజా స్వేచ్ఛ**

కూకట్ పల్లి నియోజకవర్గం లోని గాంధీనగర్ ఇండస్ట్రీ ఏరియాలో "రంకో మెటల్స్ ప్రైవేట్ లిమిటెడ్" కంపెనీలో విశ్వకర్మ అనే కార్మికుడు గత కొన్ని సంవత్సరాల నుంచి పనిచేసేవారు, కోని అనువార్య కారణాలవల్ల, కంపెనీ యజమాన్యం కార్మికుడు విశ్వకర్మ నీ తీసివేయడం జరిగింది. విశ్వకర్మ అనే కార్మికుడి కి గ్రాడ్యుయేట్ డబ్బులు 46, వేల రూపాయలు రావాల్సి ఉండగా అవి ఇవ్వకపోవడంతో పలుమార్లు కంపెనీ యజమాన్యాన్ని అడిగి విసుగు చెందిన కార్మికుడు తమకు తెలిసిన కార్మిక మిత్రుల ద్వారా బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్ గురించి తెలుసుకొని తన ఆఫీస్ వద్దకు వచ్చి తనకు జరిగిన అన్యాయం గురించి వివరించారు. వెంటనే స్పందించిన కార్మిక నాయకుడు రవిసింగ్ హుటాహుటిన కంపెనీ వద్దకు బయలుదేరి కంపెనీ యజమాన్యంతో పలుమార్లు చర్చించి కార్మికుడు విశ్వకర్మ కి రావలసిన గ్రాడ్యుయేట్ డబ్బులు 46,000/- వేల రూపాయలు ఇప్పించడం జరిగింది. కార్మికుడు విశ్వకర్మ మాట్లాడుతూ నాకు న్యాయం చేసిన కార్మిక నాయకుడు రవిసింగ్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానని. తెలిపారు.. ఈ కార్యక్రమంలో అనిల్,సుదర్శన్, జగన్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.


# బిజినెస్

## ట్రంప్ టారిఫ్స్‌ను బట్టే 2025లో బంగారం ధరలు..!

దేశ రాజధానిలో సోమవారం తులం బంగారం (24 క్యారట్స్) ధర రూ.150 పెరిగి రూ.79,350లకు చేరుకున్నది. అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ హెచ్చరికలు, ఆర్థిక విధానాన్ని బట్టి 2025లో బంగారం ధర ఆధార పడి ఉంటుందని బులియన్ మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. శుక్రవారం తులం బంగారం (99.9 శాతం స్వచ్ఛత) ధర రూ.79,200 పలికింది. ఇక సోమవారం కిలో వెండి ధర ఫ్లాట్‌గా రూ.91,700 వద్ద కొనసాగింది. 99.5 శాతం స్వచ్ఛత గల బంగారం తులం ధర సోమవారం రూ.150 పుంజుకుని 78,950 (శుక్రవారం రూ.78,800) పలికింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో గోల్డ్ కాంట్రాక్ట్స్ ఫిబ్రవరి డెలివరీ బంగారం తులం ధర రూ.41 తగ్గి రూ.76,503లకు పడిపోయింది. సిల్వర్ కాంట్రాక్ట్స్ మార్చి డెలివరీ కిలో వెండి ధర రూ.60 వృద్ధితో రూ.88,947లకు చేరుకుంది. అంతర్జాతీయ మార్కెట్లో కామెక్స్ గోల్డ్‌లో ఔన్స్ బంగారం ధర 5.70 డాలర్ల పతనంతో 2626.20 డాలర్లకు చేరుకుంది. కామెక్స్ సిల్వర్‌లో ఔన్స్ వెండి ధర ఫ్లాట్‌గా 29.96 డాలర్ల వద్ద కొనసాగింది.




### అదానీ విల్మార్ నుంచి అదానీ ఎంటర్‌ప్రైజెస్ ఎగ్జిట్.. యూఎస్ కోర్టులో అభియోగాలే కారణమా..?!




భారత బిలియనీర్ గౌతం అదానీ సారథ్యంలోని అదానీ గ్రూప్ కీలక నిర్ణయం తీసుకున్నది. తమ ఎఫ్ఎంసీజీ జాయింట్ వెంచర్ అదానీ విల్మార్ నుంచి తన వాటా పూర్తిగా విక్రయిస్తున్నట్లు అదానీ గ్రూప్ ఫ్లాగ్ షిప్ సంస్థ అదానీ ఎంటర్‌ప్రైజెస్ సోమవారం ప్రకటించింది. అదానీ గ్రూప్ అవినీతికి పాల్పడిందని అమెరికా కోర్టులో అభియోగాలు నమోదైన తర్వాత సింగపూర్ సంస్థ విల్మార్‌తో కలిసి ఏర్పాటు చేసిన జాయింట్ వెంచర్ సంస్థ నుంచి నిష్క్రమించడం గమనార్హం. తద్వారా 200 కోట్ల డాలర్ల నిధులను అదానీ గ్రూప్ సేకరించనున్నది.వంటనూనెల బ్రాండ్ ఫార్చ్యూన్ , గోధుమ పిండి, ఇతర ఆహార ఉత్పత్తుల తయారీ సంస్థ అదానీ విల్మార్ లో అదానీ ఎంటర్ ప్రైజెస్ సంస్థకు 43.94 శాతం వాటా ఉంది. ఇందులో 31.06 శాతం వాటాను నేరుగా, మిగతా 13 శాతం వాటాను బహిరంగ మార్కెట్లో విక్రయిస్తామని అదానీ ఎంటర్ ప్రైజెస్ తెలిపింది. విల్మార్‌కు అదానీ ఎంటర్ ప్రైజెస్ తన 31.06 శాతం వాటాలను విక్రయించడం వల్ల రూ.12,314 కోట్ల నిధులు లభిస్తాయి. దీంతోపాటు ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా విక్రయించడం ద్వారా 200 కోట్ల డాలర్ల పై చిలుకు (సుమారు రూ.17,100 కోట్లు) నిధులను అదానీ గ్రూప్ సేకరించనున్నది. 2025 మార్చి 31 లోపు ఈ వాటాల విక్రయం పూర్తి కావాలని భావిస్తోంది. ఆ లోగా అదానీ విల్మార్ గ్రూప్ డైరెక్టర్ల బోర్డు నుంచి అదానీ ఎంటర్ ప్రైజెస్ నామినీలు కూడా తప్పుకుంటారు. స్టాక్ మార్కెట్లలో లిస్టయిన మూడేండ్లలో కనీసం 25 శాతం షేర్లు పబ్లిక్‌కు అందుబాటులో ఉండాలని సెబీ నిబంధన. 1999లో ఏర్పాటైన అదానీ విల్మార్ .. ఫార్చ్యూన్ బ్రాండ్ వంట నూనె, గోధుమ పిండి, పప్పు ధాన్యాలు, బియ్యం, పంచదార తదితర వస్తువులు విక్రయిస్తోంది. 10 రాష్ట్రాల పరిధిలో 23 ప్లాంట్లు కలిగి ఉంది.

### బ్యాంకింగ్ ఆటో స్టాక్స్ ఎఫెక్ట్.. నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు.. ఇవీ డిటెయిల్స్..!

అంతర్జాతీయ బలహీన సంకేతాల నేపథ్యంలో సోమవారం దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాలతో ముగిశాయి. బీఎస్ఈ -30 ఇండెక్స్ సెన్సెక్స్ 450.94 పాయింట్లు పతనమై 78,248.13 పాయింట్ల వద్ద స్థిర పడింది. అంతర్గత ట్రేడింగ్‌లో 79,092.70 పాయింట్ల గరిష్ట స్థాయి నుంచి 78,077.13 పాయింట్ల కనిష్ట స్థాయి మధ్య తచ్చాడింది. మరోవైపు, ఎన్ఎస్ఈ-50 సూచీ నిఫ్టీ 168.50 పాయింట్లు నష్టంతో 23,644.90 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడే ట్రేడింగ్‌లో నిఫ్టీ 23,915.35 పాయింట్ల గరిష్ట స్థాయి నుంచి 23,618.90 పాయింట్ల మధ్య ట్రేడయింది. బ్యాంకింగ్, ఆటో స్టాక్స్ అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయి. ఐసీఐసీఐ బ్యాంకు, హెచ్డీఎఫ్సీ బ్యాంకు స్టాక్స్‌తో సూచీలు పతనం అయ్యాయి.బీఎస్ఈ-30 ఇండెక్స్ సెన్సెక్స్‌లో టాటా మోటార్స్, టైటాన్, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా స్టీల్, భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్బీఐ) షేర్లు పతనం అయ్యాయి. మరోవైపు, జోమాటో, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, సన్ ఫార్మా, ఇండస్ఇండ్ బ్యాంక్ షేర్లు లబ్ధి పొందాయి. ఫారెక్స్ మార్కెట్లో అమెరికా డాలర్‌పై రూపాయి మారకం విలువ నాలుగు పైసలు నష్టంతో రూ.85.52 వద్ద స్థిర పడింది. మరోవైపు, అంతర్జాతీయంగా క్రూడాయిల్ బ్యారెల్ 73.98 డాలర్లు, ఔన్స్ బంగారం 2625 డాలర్లు పలికింది.



# స్పోర్ట్స్

## ఓటమి తమను నిరాశపరిచింది

బుమ్రా నిజంగా మంచి బౌలర్
బుమ్రాకు బౌలర్ల నుంచి సరైన మద్దతు రావడం లేదు
టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ




నాలుగో టెస్టు మ్యాచ్‌లో మూడో రోజు భారత్ అద్భుతంగా పుంజుకుంది. నాలుగో రోజు కూడా భారత్ మంచి ప్రదర్శన చేసింది. కానీ చివరి సెషన్‌లో స్టార్ బ్యాట్స్‌మెన్‌లు చేతులు ఎత్తేయడంతో టీమిండియా ఘోర ఓటమిని చవిచూసింది. ఐదు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌లో నాలుగో మ్యాచ్‌ను కైవసం చేసుకుని ఆస్ట్రేలియా 2-1 ఆధిక్యంలో నిలిచింది. దీంతో సిరీస్‌ను కాపాడుకోవడం ఇప్పుడు భారత్‌కు పెద్ద సవాల్‌గా మారింది. మరోవైపు ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు సంబంధించిన లెక్కలు కూడా తారుమారయ్యాయి. ఫైనల్ కల దాదాపుగా చెదిరిపోయిందని చెప్పవచ్చు. ఐతే నాలుగో మ్యాచ్‌లో ఓటమి తర్వాత రోహిత్ శర్మ నిరాశగా కనిపించాడు. ఇప్పుడు ఈ సిరీస్‌లో ఐదో మ్యాచ్ జనవరి 3 నుంచి జరగనుంది.సిడ్నీ టెస్టు మ్యాచ్‌లో బరిలోకి దిగుతున్న జట్టుగా రాణించగల అవకాశం ఉందని.. ఈ మ్యాచ్‌ని బాగా ఆడేందుకు ప్రయత్నిస్తామని టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ తెలిపాడు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ రేసులో నిలవాలంటే టీమిండియా ఈ మ్యాచ్‌లో తప్పక గెలవాలి. సిరీస్‌ను సమం చేసే అవకాశం కూడా ఉంది. ఈ సందర్భంగా రోహిత్ శర్మ జస్ప్రీత్ బుమ్రాను ప్రశంసించాడు. ఈ సందర్భంగా రోహిత్ శర్మ మాట్లాడుతూ.. 'బుమ్రా నిజంగా మంచి బౌలర్. మీరు అతన్ని చాలా సంవత్సరాలుగా చూస్తున్నారు. మీరు అతని ప్రదర్శనను కూడా నాలుగో టెస్టులో చూడవచ్చు. బుమ్రా జట్టును గెలిపించాలని ప్రయత్నిస్తున్నాడు. కానీ అతనిని వేరే బౌలర్ల నుంచి సరైన మద్దతు రావడం లేదని" పేర్కొన్నాడు. అలాగే తన ప్రదర్శనపై రోహిత్ శర్మ స్పందించాడు. "కెప్టెన్‌గా, బ్యాట్స్‌మెన్‌గా కొన్ని ఫలితాలు అనుకూలంగా రాలేదు. ఇది నిరాశపరిచింది. మానసికంగా ఇబ్బంది పెడుతోంది. జట్టుగా కొన్ని విషయాలపై దృష్టి పెట్టాలి' అని రోహిత్ శర్మ పేర్కొన్నాడు. బాక్సింగ్ డే టెస్టులో భారత్ ఓటమి నిరాశపరిచిందని రోహిత్ ఆవేదన వ్యక్తం చేశాడు. నితీశ్ కూమార్ మంచి ఫ్యూచర్ ఉందని కొనియాడారు. 340 రన్స్ అంటే అంత ఈజీ కాదని, ఇంకా జట్టు ఇంప్రూవ్ కావాలని పేర్కొన్నాడు. సిడ్నీలో టెస్టులో మంచి ప్రదర్శన చేసేందుకు ప్రయత్నిస్తామని రోహిత్ ఆశాభావం వ్యక్తం చేశాడు. ....

## నితీష్ కుమార్ రెడ్డి స్టన్నింగ్ ఫీల్డింగ్



టీమిండియా యువ ఆల్‌రౌండర్, తెలుగు తేజం నితీష్ కుమార్ రెడ్డి స్టన్నింగ్ ఫీల్డింగ్‌తో ఆకట్టుకున్నాడు. ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో మెల్ బోర్న్ వేదికగా జరుగుతున్న నాలుగో టెస్ట్‌లో నితీష్ కుమార్ రెడ్డి అసాధారణ క్యాచ్ అందుకున్నాడు. చాలా దూరం పరుగెత్తి సూపర్ డైవ్‌తో బంతిని ఒడిసి పట్టుకున్నాడు. టీమిండియా యువ ఆల్‌రౌండర్, తెలుగు తేజం నితీష్ కుమార్ రెడ్డి స్టన్నింగ్ ఫీల్డింగ్‌తో ఆకట్టుకున్నాడు. ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో మెల్ బోర్న్ వేదికగా జరుగుతున్న నాలుగో టెస్ట్‌లో నితీష్ కుమార్ రెడ్డి అసాధారణ క్యాచ్ అందుకున్నాడు. చాలా దూరం పరుగెత్తి సూపర్ డైవ్‌తో బంతిని ఒడిసి పట్టుకున్నాడు. ప్రస్తుతం ఈ క్యాచ్‌కు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. స్టన్నింగ్ క్యాచ్ అందుకున్న నితీష్ కుమార్ రెడ్డిపై నెటిజన్లు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. తెలుగోడి క్యాచ్.. పోలా అదిరిపోలా అంటూ కామెంట్ చేస్తున్నారు. నితీష్ కుమార్ రెడ్డి స్టన్నింగ్ క్యాచ్‌తో ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ హాఫ్ సెంచరీ చేజార్చుకున్నాడు. రవీంద్ర జడేజా వేసిన 105వ ఓవర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ఓవర్ తొలి బంతిని జడేజా ఆఫ్ స్టంప్ లైన్‌లో వేయగా ప్యాట్ కమిన్స్ భారీ షాట్ ఆడాడు. కానీ సరిగ్గా తాకని బంతి ఓవర్ మిడాన్ దిశగా గాల్లోకి లేచింది.కవర్స్ నుంచి పరుగెత్తుకొచ్చిన నితీష్ కుమార్ రెడ్డి సూపర్ డైవ్‌తో బంతిని అందుకున్నాడు. క్యాచ్ అందుకోవడంతో పాటు ఏడో వికెట్‌కు నమోదైన 112 పరుగుల భాగస్వామ్యానికి తెరదించాడు.

## వివాదస్పదంగా మారిన యశస్వి జైస్వాల్ వికెట్

-స్నికో మీటర్‌పై నమోదుకాని ఎటువంటి శబ్దం




మెల్‌బోర్న్‌లో జరుగుతున్న నాల్గవ టెస్టు ఐదో రోజు ఆటలో యశస్వి జైస్వాల్ వికెట్ వివాదస్పదంగా మారింది. స్నికో మీటర్‌పై ఎటువంటి శబ్దం నమోదు కాకపోయినా.. థర్డ్ అంపైర్ అవుట్ ఇవ్వడంతో వివాదం రేగింది. దీంతో ప్రస్తుతం జైస్వాల్ ఔట్ వీడియో సోషల్ మీడియాలో తెగ సందడి చేస్తోంది. విజయం కోసం ఆస్ట్రేలియా, డ్రా కోసం భారత ఆటగాళ్లు తీవ్రంగా ప్రయత్నిస్తోన్న తరుణంలో జైస్వాల్ 84 పరుగుల వద్ద ఓ షాకింగ్ నిర్ణయంతో పెవిలియన్ చేరాడు. దీంతో ఇదెలా ఔట్ అవుతుందంటూ సోషల్ మీడియాలో ప్రశ్నల వర్షం కుస్తోంది. అంపైర్ ఔట్ ఇవ్వలేదు. దీంతో ఆస్ట్రేలియా ఆటగాళ్లు డీఆర్ఎస్ తీసుకున్నారు. ఈ క్రమంలో థర్డ్ అంపైర్ అన్ని యాంగిల్స్ చూసినా ఏం అర్థం కాలేదు. చివరకు స్నికో తీసుకున్నా అందులో ఎటువంటి స్పైక్ రాలేదు. కానీ, చివరకు థర్డ్ అంపైర్ ఔట్‌గా ప్రకటించడంలో, అయితే ఆన్-ఫీల్డ్ అంపైర్ జోయెల్ విల్సన్ దానిని తిరస్కరించాడు. మరోసారి ఈ నిర్ణయం వివాదస్పదంగా మారింది.స్నికో మీటర్‌పై ఎటువంటి కాంటాక్ట్ లేకపోయినా టీమిండియా బ్యాటర్‌ను అవుట్ చేయడంతో వివాదం మొదలైంది. 84 పరుగుల వద్ద బ్యాటింగ్ చేస్తున్న ఈ ఎడమచేతి వాటం ఆటగాడు పాట్ కమ్మిన్స్ సంధించిన షార్ట్ పిచ్ డెలివరీని కొట్టేందుకు ప్రయత్నించాడు. కానీ, అతని హుక్ షాట్ సక్సెస్ కాలేదు. దీంతో ఆస్ట్రేలియా డీఆర్ఎస్ తీసుకుంది.



# కుర్రాళ్ళ డ్రీమ్ గర్ల్ ఈ చిన్నది

టాలీవుడ్ లో కొత్త అందాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. కొత్త భామలు మంచి అవకాశాలు అందుకుంటూ రాణిస్తున్నారు. సీనియర్ హీరోయిన్స్ తో పోటీపడుతూ ప్రేక్షకులను అలరిస్తున్నారు. అందం, అభినయం ఉన్న అమ్మాయిలను మనవాళ్లు ఎప్పుడూ ఆదరిస్తునే ఉంటారు. అలా ఎంతో మంది ముద్దుగుమ్మలు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటుంటారు. అన్నీ కలిసిస్తే దశాబ్ధాల పాటు వారికి అవకాశాలు వెల్లువలా వస్తాయి. ఇప్పటికే చాలా మంది భామలు ఏళ్ల తరబడి హీరోయిన్స్ గా రాణిస్తున్నారు. శ్రియ, త్రిష, నయనతార, కాజల్ వంటి హీరోయిన్స్ ఆ కోవకు చెందినవారే. ఇప్పుడు చాలా మంది భామలు కూడా వీరినే ఫాలో అవుతున్నారు. ఇప్పుడు ఓ అమ్మాయి తెలుగు కుర్రాళ్లకు మోస్ట్ వాంటెడ్ క్వీన్‌గా మారింది. తన అందంతో కుర్రకారుకు నిద్రపట్టకుండా చేస్తుంది. ఆ ఫోటోలను వాల్ పేపర్ కింద పెట్టుకుంటున్నారు చాలామంది.అలా ఈ పైన ఫొటోలో కనిపిస్తున్న చిన్నారి కూడా కొంతకాలం క్రితం టాలీవుడ్?కు ఎంటరయ్యింది?. 2018లో ఫెమినా మిస్ ఇండియా విజేతగా, మిస్ గ్రాండ్ ఇంటర్నేషనల్ రన్నరప్?గా నిలిచింది. సుశాంత్ హీరోగా చేసిన ఓ సినిమాలో హీరోయిన్?గా చేసింది. సినిమా పెద్దగా ఆడకపోయినప్పటికీ ఈ బ్యూటీ స్క్రీన్ ప్రజెన్స్‌కు మంచి మార్కులే పడ్డాయి. అదే ఈ అమ్మడి తొలి సినిమా. . 'ఇచ్చట వాహనములు నిలుపరాదు' మూవీతో టాలీవుడ్‌ను పలకరించింది ఈ ముద్దుగుమ్మ.. ఆ తర్వాత మాస్ మహారాజా రవితేజ హీరోగా చేసిన 'ఖిలాడీ'లో తన అందంతో కవ్వించింది. ధమాకా సినిమాలో మాస్ పాటకు స్టెప్పులేసి అదరహో అనిపించింది. హాట్ హాట్ అందాలతో కుర్రాళ్లను గిలిగింతలు పెట్టింది. ఆ తర్వాత అడివి శేష్ సరసన 'హిట్-2'లో చేసింది. మహేష్ బాబు గుంటూరు కారం సినిమాల్లో నటించింది. వీరితో పాటు తమిళ్ స్టార్ హీరో దళపతి విజయ్ నటించిన గోట్ సినిమాలో నటించింది. అలాగే విశ్వక్ సేన్, వరుణ్ తేజ్, దుల్కర్ సల్మాన్ హీరోలుగా నటించిన సినిమాల్లోనూ చేసి మెప్పించింది. ఇప్పుడు చేతి నిండా




# నెంబర్‌వన్ స్థానంలో నిలిచిన కల్కి 2898 ఏడీ చిత్రం

ప్రముఖ ఎంటర్‌టైన్మెంట్ పోర్టల్ ఇంటర్నెట్ మూవీ డేటా బేస్ ప్రతి సంవత్సరం దేశంలోని సినిమాల క్రేజ్ గురించి సర్వే నిర్వహించి.. మోస్ట్ పాపులర్ విభాగంలో టాప్ పొజిషన్‌లో ఉన్న సినిమాల జాబితాలను విడుదల చేస్తుందన్న విషయం తెలిసిందే. తాజాగా ఈ ఏడాది మోస్ట్ పాపులర్‌గా నిలిచిన సినిమాల జాబితాను ఐఎండీబీ విడుదల చేసింది. ఈ జాబితాలో ప్రభాస్ నటించిన కల్కి 2898 ఏడీ చిత్రం అగ్ర స్థానంలో ఉండగా.. బాలీవుడ్ బ్లాక్ బస్టర్ అందుకున్న 'స్త్రీ 2' రెండో స్థానంలో నిలిచింది. ఇక టాప్ టెన్‌లో ఉన్న సినిమాలు ఒకసారి చూసుకుంటే.! ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వచ్చిన బ్లాక్ బస్టర్ 'కల్కి 2898 ఏడీ. ది గ్రేట్ లెజెండ్స్ అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, హీరోయిన్ దీపిక పదుకొనే వంటి గొప్ప యాక్టర్స్ నటించిన ఈ చిత్రం జూన్ 27 న ప్రపంచవ్యాప్తంగా విడుదలై బ్లాక్ బస్టర్ అందుకొవడమే కాకుండా.. రూ.1300 కోట్ల వసూళ్లను రాబట్టింది. ఈ చిత్రం 2024 ఐఎండీబీ మోస్ట్ పాపులర్ సినిమా విభాగంలో టాప్ పోజిషన్‌లో నిలిచింది.

# వైవిధ్యభరితమైన పాత్రలో వస్తున్న అనుష్క 'ఘాటీ'

కెరీర్ బిగినింగ్‌లో గ్లామర్ పాత్రల్లో ఓ వెలుగు వెలిగింది అనుష్క. అయితే.. 'అరుంధతి' తర్వాత ఆమె నుంచి రెగ్యులర్ గ్లామర్ పాత్రలు కాకుండా, అభినయానికి ఆస్కారమున్న పాత్రల్నే ఆడియన్స్ ఆశించడం మొదలుపెట్టారు. ఈ క్రమంలో ఆమె చేసిన వేదం, బాహుబలి ఫ్రాంచైజీ, రుద్రమదేవి, సైజ్ జీరో, భాగమతి, నిశ్శబ్ధం, మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి సినిమాలు ఆమెను నటిగా గౌరవప్రదమైన స్థానంలో కూర్చోబెట్టాయి. ఆ వరుసలో ఆమె చేస్తున్న మరో వైవిధ్యమైన సినిమానే 'ఘాటీ'. క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం ఉత్తరాంధ్ర గంజాయి తోటల నేపథ్యంలో సాగే విభిన్న కథాచిత్రమని తెలుస్తున్నది. ఇందులో అనుష్క పాత్ర ఊహలకు అతీతంగా ఉంటుందని సమాచారం. ఇటీవల విడుదలైన టీజర్‌లో.. అనుష్క బస్‌లో ఓ వ్యక్తిని మర్డర్ చేసే సన్నివేశం సినిమాపై అంచనాలు పెంచేసింది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ 80 శాతం పూర్తయింది. ట్కక్లైమాక్స్ షూట్ మాత్రమే మిగిలివుంది. మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ కూడా నడుస్తున్నది. జనవరి చివరివారం నుంచి ట్కక్లైమాక్స్ షూట్ ఉంటుందని తెలుస్తున్నది. ఏప్రిల్ 18న చిత్రాన్ని విడుదల చేయనున్నారు. సాయిమాధవ్ బుర్రా ఈ సినిమాకు సంభాషణలు అందిస్తున్న విషయం తెలిసిందే.






# చెంచుల యువరాణిగా ప్రీతి ముకుందన్.. కన్నప్ప' నుంచి ఫస్ట్ లుక్ రిలీజ్

ఒకవైపు ఫ్యామిలీ గొడవలతో సతమవుతున్న మంచు ఫ్యామిలీ.. మరోవైపు తమ కలల ప్రాజెక్ట్ కన్నప్పను పూర్తి చేసే పనిలో పడింది. మంచు కుటుంబం నుంచి వస్తున్న మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ కన్నప్ప దాదాపు రూ.100 కోట్ల బడ్జెట్‌తో వస్తున్న ఈ సినిమాను కలెక్షన్ కింగ్ మంచు మోహన్ బాబు నిర్మిస్తుండగా.. మంచు విష్ణు కథానాయకుడిగా నటిస్తున్నాడు.హిస్టారికల్ కం మైథాలజీ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ చిత్రంలో ప్రభాస్‌తో పాటు బాలీవుడ్, కోలీవుడ్ అగ్ర తారలు నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి మహాభారతం సీరియల్ ఫేమ్ ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే ఈ మూవీ నుంచి మంచు మోహన్ బాబు, మంచు విష్ణులతో పాటు పలువురు అగ్ర కథానాయకుల ఫస్ట్ లుక్‌లను పంచుకున్న చిత్రబృందం తాజాగా ఈ సినిమాలో కథానాయికగా నటిస్తున్న ప్రీతి ముకుందన్ ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది. ఈ సినిమాలో ప్రీతి కన్నప్ప ఇష్టసఖి, చెంచుల యువరాణి నెమలి పాత్రలో నటిస్తుంది. 'అందంలో సహజం.. తెగింపులో సాహసం.. ప్రేమలో అసాధారణం.. భక్తిలో పారవశ్యం.. కన్నప్పకి సర్వస్వం చెంచుల యువరాణి నెమలి అంటూ" ప్రీతి ముకుందన్ ఫస్ట్‌లుక్‌ను పంచుకుంది.

Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492